మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

Published from Jagitial
Circulated to Telangana

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 17-4-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 288 Issue: 288

17 ఏప్రిల్ 2026 - శుక్రవారం, శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం - వసంత ఋతువు, చైత్ర మాసం - కృష్ణపక్షం, సూర్యోదయం - ఉ. 6:02, సూర్యాస్తమయం - సా. 6:29, తిథి, అమావాస్య సా. 5:18 వరకు, తరువాత పాడ్యమి, సంస్కృత వారం, భృగు వాసరః ,నక్షత్రం, రేవతి మ. 12:02 వరకు, తరువాత అశ్విని, యోగం, వైధృతి ఉ. 7:12 వరకు, కరణం చతుష్పాద ఉ. 6:49 వరకు, నాగవ సా. 5:18 వరకు, వర్జ్యం, లేదు, దుర్ముహూర్తం, ఉ. 8:31 నుండి ఉ. 9:21 వరకు, రాహుకాలం, ఉ. 10:42 నుండి మ. 12:15 వరకు, యమగండం, మ. 3:22 నుండి సా. 4:55 వరకు, గుళికాకాలం, ఉ. 7:35 నుండి ఉ. 9:09 వరకు, బ్రహ్మముహూర్తం, తె. 4:26 నుండి తె. 5:14 వరకు, అమృత ఘడియలు, ఉ. 10:13 నుండి ఉ. 11:42 వరకు, అభిజిత్ ముహూర్తం, ఉ. 11:51 నుండి మ. 12:40 వరకు, గమనిక: "ం" అనగా మరుసటి రోజున

www.evarthalu.com




## మహిళలకు 272 సీట్లు

కోటాలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ కూడా

లోక్‌సభలో పెరగనున్న ప్రాతినిధ్యం

కేంద్ర మంత్రి అర్జున్ మేఘ్‌వాల్ వెల్లడి

'లోక్‌సభ మొత్తం సీట్ల సంఖ్య 815కు చేరుకుంటుంది. ఈ బిల్లులతో లోక్‌సభలో మహిళలకు 272 సీట్లు లభిస్తాయని చెప్పుకొచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రకారం లోక్‌సభ సభ్యుల సంఖ్య 815కు పెరుగుతుంది, అందులో మహిళలకు 272 సీట్లు కేటాయించనున్నాం' అని పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ కీలక ప్రకటన చేశారు. › 2



## ఏపీకి 38.. టీజీకి 26

తెలుగు రాష్ట్రాల్లో పెరిగే లోక్‌సభ సీట్లు

కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెల్లడి

543 ఉన్న లోక్‌సభ సీట్లను 50% పెంచి 850 వరకు తీసుకెళ్లే ప్రణాళిక



లోక్‌సభలో మహిళల రిజర్వేషన్ బిల్లుతో పాటు డీలిమిటేషన్ అంశంపై తీవ్ర చర్చ జరుగుతున్న వేళ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందనే ప్రచారం తప్పని, డీలిమిటేషన్ వల్ల ఆ రాష్ట్రాలకు తగిన రీతిలో సీట్లు పెరుగుతాయని వివరించారు. › 2

## ఇజ్రాయెల్-లెబనాన్ కాల్పుల విరమణ

**వెల్లడించిన అమెరికా ట్రంప్**

వాషింగ్టన్: మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించే దిశగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇజ్రాయెల్, లెబనాన్ దేశాల మధ్య 10 రోజుల పాటు తాత్కాలిక కాల్పుల విరమణకు ఇరు పక్షాలు అంగీకరించాయని తెలిపారు. లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్, ఇజ్రాయెల్ ప్రధాని బెన్యామిన్ నెతన్యాహులతో జరిపిన ఉన్నత స్థాయి చర్చల తర్వాత ఈ నిర్ణయం వెలువడింది. శాంతి స్థాపనలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించిన ట్రంప్, ఇది తన కెరీర్‌లో తాను పరిష్కరించిన 10వ యుద్ధం అని గర్వంగా పేర్కొన్నారు. దాదాపు 34 ఏళ్ల తర్వాత ఇరు దేశాల ప్రతినిధులు వాషింగ్టన్ డీసీలో నేరుగా చర్చలు జరపడం ఒక చారిత్రాత్మక ఘట్టమని ట్రంప్ వివరించారు. ఈ శాంతి ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియోకు కీలక బాధ్యతలు అప్పగించారు. ఈ కాల్పుల విరమణ మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి అధికారికంగా అమలులోకి వచ్చినట్లైంది.



## దేశ విభజనలా తెలంగాణ విభజన

బ్రిటీషర్ల కంటే దారుణంగా కాంగ్రెస్ తీరు

**నేటికీ ఏపీ, టీజీ మధ్య ఘర్షణ వాతావరణం**

**బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వివాదాస్పద వ్యాఖ్యలు**

భారత్, పాకిస్థాన్ కన్నా దారుణంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణను విభజించారని బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గురువారం లోక్ సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ నాడు అత్యంత దారుణంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలను విభజించిందని మండిపడ్డారు.

న్యూఢిల్లీ: కాంగ్రెస్ చేసిన విభజన బ్రిటిష్ వారి కంటే దారుణంగా ఉందని అన్నారు. ఏపీ, తెలంగాణ విభజనను కాంగ్రెస్ పాకిస్థాన్, భారత్ విభజనతో పోల్చారు. విభజన సమయంలో కాంగ్రెస్ అనుసరించిన విధానం వల్ల రెండు రాష్ట్రాల మధ్య నేటికీ ఘర్షణ వాతావరణం నెలకొందని అన్నారు. డీలిమిటేషన్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వితండవాదం చేస్తున్నారని, ఆయన చెబుతున్నది విని తెలంగాణ

- తరువాయి 2 వ పేజీలో...

నియోజకవర్గాల పునర్విభజనకు రాష్ట్ర జనాభాను, జీఎస్‌డీపీని అనుసంధానించాలంటూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రతిపాదన అత్యంత తెలివితక్కువైనది. ఇది రాజ్యాంగ విరుద్ధం. మీకు గుర్తుంటే కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను ఏపీ, తెలంగాణాలుగా విభజించినపుడు దేశాన్ని భారత్, పాకిస్థాన్‌గా విభజించిన బ్రిటిషర్ల కంటే ఘోరంగా చేశారు.

*- లోక్‌సభలో బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య*



## మావోళ్లు ఉంటే నీ సంగతి అయ్యేదే

**తేజస్వీ సూర్యకు హరీశ్ రావు వార్నింగ్**

తెలంగాణ ఏర్పాటును పాకిస్థాన్ విభజనతో పోల్చిన బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.'తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం దశాబ్దాల పోరాటం, వేలాది మంది విద్యార్థులు, యువత, ఉద్యోగులు, ప్రజల త్యాగాల ఫలితం. › 2



## తేజస్వీ తెలివి లేని వెధవ

**మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్**

బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలపై తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తేజస్వీ సూర్యను తెలివి లేని వెధవ అంటూ మండిపడ్డారు. రాజ్యాంగబద్ధంగా, బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన ఆర్టికల్ 3 ప్రకారం ఏర్పడిన తెలంగాణను.. దేశ విభజనతో పోల్చుతారా? అని ప్రశ్నించారు. › 2




## బంగారం-వెండి ధరలు



**బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)**

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,557 |
| వెండి (గ్రాము): | రూ.275 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,403 |





## ఇక మహిళా నాయకత్వం!

**నిర్ణయ ప్రక్రియలో స్త్రీల భాగస్వామ్యం**

**దేశ చరిత్రలో ఈ రోజు చాలా గొప్పది**

**బిల్లును వ్యతిరేకిస్తే మూల్యం తప్పదు**

**లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీ**

ప్రధాని లోక్‌సభలో ప్రసంగిస్తూ.. మహిళా రిజర్వేషన్ బిల్లుకు రాజకీయ రంగు పులమొద్దన్నారు. 'దేశ ప్రయోజనాల కోసం తీసుకువచ్చిన బిల్లు ఇది.

న్యూఢిల్లీ: మహిళా రిజర్వేషన్ బిల్లు దేశ చరిత్రలో కీలక ఘట్టం అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లకు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు ఉద్దేశించిన మూడు కీలక బిల్లులను కేంద్రం గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. దీనిపై చర్చలో భాగంగా ప్రధాని లోక్‌సభలో ప్రసంగిస్తూ..

- తరువాయి 2 వ పేజీలో...

## బీజేపీ నరనరాన విషం




**తెలంగాణ ఏర్పాటుపై ద్వేషం**

**తేజస్వీ క్షమాపణ చెప్పాలి.. కేటీఆర్ డిమాండ్**

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఈవార్తలు): పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై బీజేపీ నాయకులు మరోసారి తమ ద్వేషాన్ని వెళ్లగక్కారని, ఆ పార్టీ నేతలకు తెలంగాణ అస్తిత్వంపై గౌరవం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటాన్ని భారత్ –పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి అహంకార పూరిత, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు పదే పదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమర వీరుల త్యాగాలను అవమానించడం అలవాటుగా మార్చుకున్నారని మండిపడ్డారు. స్వయంగా ప్రధానమంత్రి మోదీ నుంచి మొదలుకొని ఈరోజు పార్లమెంట్ సభ్యుడు తేజస్వీ సూర్య వరకు ప్రతి ఒక్కరు తెలంగాణ వ్యతిరేకతను పదేపదే చాటుకుంటున్నా రన్నారు. తెలంగాణ ఏర్పాటు పైన విషం కక్కుతూ

- తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



పై చిత్రంలో ఉన్న యువతి పేరు డేసియా టేలర్. 17 ఏళ్ల వయసులోనే మెడికల్ హిస్టరీలో తన పేరును లిఖించుకుంది. చర్మం తెగినా, సర్జరీ సమయాల్లో కుట్లు వేస్తుంటారు. అయితే, ఆ గాయం ఇన్ఫెక్షన్లకు గురైందో లేదో తెలుసుకొనేందుకు రంగు మార్చే కుట్లను అభివృద్ధి చేసింది. ఇన్ఫెక్షన్లు అయితే, వెంటనే ఆ కుట్లు రంగు మార్చుకొని వైద్యులను అలర్ట్ చేస్తాయన్న మాట.

## పెళ్లికి బంగారం, పట్టుచీర రైతులకు రుణమాఫీ

**విజయ్ మ్యానిఫెస్టో విడుదల**



చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రముఖ నటుడు, రాజకీయ నాయకుడు విజయ్ తన పార్టీ టీవీకే మ్యానిఫెస్టోను విడుదల చేశారు. మహిళలు, రైతులపై వరాల జల్లు కురిపించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే 60 ఏళ్ల వయసు లోపు ఉన్న మహిళలకు నెలకు రూ.2500 చొప్పున ఇస్తామని ప్రకటించారు. అలాగే పేద అమ్మాయిల వివాహాలకు ఎనిమిది గ్రాముల

- తరువాయి 2 వ పేజీలో...



## కాళ్లకు పొక్కులు

› 2

**భానుడి భగభగలు.. ఆదిలాబాద్‌లో 43.8 డిగ్రీలు**

*రాష్ట్రవ్యాప్తంగా ఎండలు ఠారెత్తిస్తున్నాయి. గురువారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 43.8 డిగ్రీలు, నిజామాబాద్ జిల్లాలో 42.7, మహబూబ్‌నగర్‌లో 42, రామగుండంలో 42 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.*

## ఏ మతాన్ని ఏమనగలం?

**సంస్కరణల పేరిట మతాచారాలను తొలగించలేం**

**అది మాకు కష్టమైన పనే: సుప్రీంకోర్టు**

న్యూఢిల్లీ: సామాజిక సంక్షేమం, సంస్కరణల పేరిట ఏ మతంలోని సారాన్నీ తీసివేయలేమని సుప్రీంకోర్టు విస్తృత రాజ్యాంగ ధర్మాసనం తెలిపింది. శబరిమల ఆలయంలో తరుణ వయస్సు మహిళల ప్రవేశాన్ని అనుమతిస్తూ ఇచ్చిన ఆదేశంపై పునఃసమీక్షించాలంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా పలు వ్యాఖ్యలు చేసింది. సామాజిక సంస్కరణ పేరిట మతానికి సంబంధించిన ఆచారాలను తొలగించలేమని తొమ్మిది న్యాయమూర్తుల బెంచ్ తెలిపింది. లక్షలాది మంది నమ్మకాల్ని తప్పు అని ప్రకటించడం అత్యంత కష్టమైన పనుల్లో ఒకటని పేర్కొంది. భారత ప్రధాన

- తరువాయి 2 వ పేజీలో...



# రాశి ఫలాలు

17-4-2026

మేషం: సంతాన విద్యా విషయాలపై దృష్టి సారిస్తారు. వ్యాపారం ఉత్సాహంగా సాగుతుంది. దగ్గరి వారి నుండి సమయానికి ఆర్థిక సహాయం అందుతుంది. దీర్ఘకాలిక ఋణాల నుండి ఉపశమనం కలుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభాపాటవాలు వెలుగులోకి వస్తాయి. సమాజంలో పేరు ప్రఖ్యాతులు పెరుగుతాయి.

వృషభం: ముఖ్యమైన పనులలో ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసి విజయం సాధిస్తారు. చుట్టుపక్కల వారితో ఉన్న స్థిరాస్తి వివాదాలు ఓ కొలిక్కి వస్తాయి. వృత్తి ఉద్యోగాలలో అధికారుల సహాయ సహకారాలు అందుతాయి. వృత్తి వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. నిరుద్యోగులకు నూతన అవకాశాలు వస్తాయి.

మిథునం: ఆలయ సందర్శన చేసుకొంటారు. సంతాన విషయంలో ఊహించని సంఘటనలు ఎదుర్కొంటారు. ఋణదాతల ఒత్తిడి అధికమై మానసిక బాధలు ఎదుర్కొంటారు. దూర ప్రయాణాలు వాయిదా వేసుకోవడం మంచిది. స్థిరాస్తి వ్యవహారాలు అతి కష్టం మీద పూర్తి అవుతాయి. వృత్తి ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులుంటాయి.

కర్కాటకం: కుటుంబ పెద్దలతో మాటపట్టింపులుంటాయి. ఉద్యోగాల్లో అధికారుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది. మిత్రులతో భేదాభిప్రాయాలు వస్తాయి. అనుకున్న సమయానికి అనుకున్న విధంగా పనులు పూర్తి చేయలేరు. ఇంటా బయట ఒత్తిడి అధికమై ఆరోగ్య సమస్యలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి.

సింహం: ఆర్థికపరంగా చేసే ప్రయత్నాలు అనుకూల ఫలితాలు ఇస్తాయి. బంధుమిత్రుల సమాగమం ఆనందం కలిగిస్తుంది. సంఘంలో పేరు ప్రఖ్యాతలు పెరుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో అందరితో సఖ్యతగా వ్యవహరించి ఆకట్టుకుంటారు. వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. కుటుంబ సభ్యులతో కలిసి ప్రయాణ సూచనలు కలవు.

కన్య: సమయానికి తగిన ధన సహాయం అందుతుంది. వ్యాపారాలు మరింత పుంజుకుంటాయి. ఆరోగ్యం కుదుటపడుతుంది. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. నిరుద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభకు అధికారుల నుండి మన్ననలు అందుకుంటారు.

తుల: గృహమున విలువైన పత్రముల విషయంలో జాగ్రత్త వ్యవహరించాలి. వ్యాపారాలలో స్వంత నిర్ణయాలు కలిసిరావు. ఉద్యోగమున విధులు సరిగా నిర్వర్తించలేక పైవారి నుండి మాట పడవలసి వస్తుంది. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలో స్థిరత్వం ఉండదు.

వృశ్చికం: నూతన వాహనం కొనుగోలు ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. బంధు మిత్రులతో మాట పట్టింపులు ఉంటాయి. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. అవసరానికి ఆర్థిక సహాయం అందక ఇబ్బందిపడతారు. వృత్తి వ్యాపారాలు మందగిస్తాయి.

ధనస్సు: అన్ని వైపుల నుండి ఆదాయ మార్గాలు పెరుగుతాయి. కీలకమైన పనులలో ధైర్యంగా నిర్ణయాలను తీసుకుని లాభపడతారు. వస్త్రాభరణాలు కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన వ్యాపార ప్రారంభానికి అవరోధాలు తొలగుతాయి. బంధువుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుకొంటారు.

మకరం: అనవసర వస్తువులపై ధనవ్యయం చేస్తారు. సమయానికి నిద్రహారాలు ఉండవు. నేత్ర సంబంధిత అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉంటుంది. ఇతరుల నుండి విమర్శలు ఎదురవుతాయి. ఉద్యోగాలు మందకొడిగా సాగుతాయి. బంధుమిత్రులతో విభేదాలు ఉంటాయి.

కుంభం: సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. బంధు మిత్రుల నుండి విలువైన వస్తువులు బహుమతులు పొందుతారు. నిరుద్యోగులకు ఉత్సాహంగా సాగుతుంది. విందు వినోద కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటారు. సంతానం విషయాలు సంతృప్తినిస్తాయి.

మీనం: ప్రయాణాలలో మార్గ అవరోధాలు ఉంటాయి. ఆర్థిక వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు మంచివి కావు. ఊహించని విధంగా ఖర్చులు అధికమవుతాయి. ఇంటా బయట అప్రమత్తంగా వ్యవహరించాలి. వృత్తి ఉద్యోగాలలో స్థానచలన సూచనలున్నవి. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది.

# ఇక మహిళా నాయకత్వం!



(మొదటి పేజీ తరువాయి)

మహిళా రిజర్వేషన్ బిల్లుకు రాజకీయ రంగు పులమొద్దన్నారు. 'దేశ ప్రయోజనాల కోసం తీసుకువచ్చిన బిల్లు ఇది. మహిళా రిజర్వేషన్ బిల్లు క్రెడిట్ అందరికీ దక్కుతుంది. మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించి నష్టపోవద్దు. క్షేత్రస్థాయిలో మహిళా నాయకత్వం సిద్ధంగా ఉంది. నిర్ణయ ప్రక్రియలో భాగస్వాములు కావాలని వారంతా భావిస్తున్నారు. అన్ని వర్గాలను అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత నాది. బీసీ వర్గాల్లో జన్మించిన నాకు ప్రధాని పదవి దక్కడం రాజ్యాంగ నిర్మాతల చలవే. డీలిమిటేషన్ వల్ల ఏ రాష్ట్రానికి అన్యాయం జరగదు. గ్యారెంటీగా అంశాన్ని ఈ విషయాన్ని చెపుతున్నా. ఇప్పుడున్న నిష్పత్తిలో నియోజకవర్గాల్లో పెరుగుతాయి. మా విధానాల్లో స్పష్టత ఉంది. గతంలో జరిగిన మహిళలకు జరిగిన వివక్ష అనే పాపాన్ని కడిగేస్తున్నాం. సాంకేతిక అంశాలతో వ్యతిరేకించొద్దు. బిల్లును ఎలాగా ఆమోదించాలో సమయం నిర్ణయిస్తుంది. మూడు దశాబ్దాల పాటు మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్నారు. మహిళా బిల్లుకు అన్ని పార్టీలు ఏకగ్రీవంగా మద్దతివ్వాలి. ఈ బిల్లును తేవడంలో ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదు' అని అన్నారు. డీలిమిటేషన్ వల్ల ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకించే వారు మూల్యం చెల్లించుకోక తప్పదంటూ విపక్షాలను హెచ్చరించారు. 'దేశ పార్లమెంట్ చరిత్రలో ఈ రోజును మర్చిపోలేం. మహిళా రిజర్వేషన్ గొప్ప బిల్లు. ఈ చారిత్రక సమయంలో పాలు పంచుకోవడం నా అదృష్టం. ఈ బిల్లులతో దేశానికి సరికొత్త దశ, దిశను ఇస్తున్నాం. వికసిత్ భారత్ అంటే రోడ్లు, రైళ్లు, మౌలిక సదుపాయాలు మాత్రమే కాదు. మహిళల స్వావలంబన కూడా ఉంటేనే అది సంపూర్ణ వికసిత్ భారత్ అవుతుంది. దేశ రాజకీయాల్లో, వికసిత్ భారత్ సాధనలో మహిళల పాత్ర కీలకం. మహిళలకు అవకాశమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. రాజకీయాల్లో తమ శక్తిని చాటేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు. ఎవరికైనా అవకాశమిస్తేనే కదా.. వారి సామర్థ్యం తెలుస్తుంది. రాజకీయాల్లో సామర్థ్యం, అనుభవం ఉన్న మహిళలు పుష్కలంగా ఉన్నారు. దేశ ప్రగతిలో మహిళలకూ బాగస్వామ్యం కల్పించాల్సిందే. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు.. మహిళలకు మనం ఇస్తున్న కానుక కాదు. అది వారి హక్కు. ఈ బిల్లును తీసుకురాగానే కొందరు విభజన రాజకీయాలు చేస్తున్నారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ మాట్లాడుతున్నారు. అలాంటి వారిని ప్రజలు ఇప్పటికే దూరం పెట్టారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు. చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం, ఉత్తరాది, దక్షిణాది అనే భేదభావం మాకు లేదు. ఏ ప్రాంతానికీ అన్యాయం జరగదని హామీ ఇస్తున్నాం. ఈ బిల్లుతో కేవలం దేశంలోని మహిళలకు వారి హక్కులను కల్పిస్తున్నాం. ఈ బిల్లుపై క్రెడిట్ నాకు అవసరం లేదు. మీరే (విపక్షాలను ఉద్దేశిస్తూ) తీసుకోండి.. మహిళా బిల్లుపై అన్ని పార్టీల నేతల ఫొటోలూ వేసుకోండి. ఈ బిల్లును అడ్డుకోకుండా సహకరించి మీ గొప్పతనం చాటుకోండి. మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదిద్దాం' అని విపక్షాలను మోదీ కోరారు.

## మావోళ్లు ఉంటే నీ సంగతి అయ్యేదే

### తేజస్వీ సూర్యకు హరీశ్ రావు వార్నింగ్

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఈవార్తలు): తెలంగాణ ఏర్పాటును పాకిస్థాన్ విభజనతో పోల్చిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.'తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం దశాబ్దాల పోరాటం, వేలాది మంది విద్యార్థులు, యువత, ఉద్యోగులు, ప్రజల త్యాగాల ఫలితం. అలాంటి మహోన్నత ఉద్యమాన్ని విద్వేషపూరిత విభజనతో పోల్చడం చరిత్రను అవమానించడమే. అమరుల త్యాగాలను తక్కువ చేసి చూపించమే. రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రం దేశానికే రోల్ మోడల్‌గా నిలవడాన్ని బీజేపీ తట్టుకోలేకపోతోందనడానికి తేజస్వి అహంకార పూరిత వ్యాఖ్యలే నిదర్శనం . బీజేపీ అధిష్టానం వెంటనే ఈ వ్యాఖ్యలను ఖండించి, తన పార్టీ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలి. లేదంటే ఇది బీజేపీ అధికారిక ధోరణిగానే ప్రజలు భావిస్తారు. ఇండియా పాకిస్థాన్ విభజన లాంటిదే తెలంగాణ ఏర్పాటు అయితే ఆనాడు బీజేపీ విభజన బిల్లుకు ఎందుకు మద్దతు తెలిపింది? ప్రధాని మోదీ కూడా గతం లో అనేక సార్లు తెలంగాణ ఏర్పాటు ప్రక్రియపై విషం చిమ్మారు. నాడు మోదీ అయినా నేడు తేజస్వి సూర్య అయినా తెలంగాణ ప్రజల మనోభావాలను గాయపరచడమే పనిగా పెట్టుకున్నారు. తేజస్వి సూర్య అనుచిత వ్యాఖ్యలను తెలంగాణ నుంచి గెలిచిన ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు, కాంగ్రెస్ ఎంపీలు ఖండించకుండా గుడ్లప్పగించి చూడడం సిగ్గుచేటు. లోక్ సభలో బీఆర్ఎస్ ఎంపీలు ఉంటే తేల్చేవారు. బీజేపీ ఎంపీలు అయినా కాంగ్రెస్ ఎంపీ లైనా తెలంగాణ పాలిట దిష్టి బొమ్మలుగా మారారు. తెలంగాణ పేరుతో గెలిచి, తెలంగాణ అవమానాన్ని చూసి నిశ్శబ్దంగా కూర్చున్న ఎంపీలు ప్రజలకు సమాధానం చెప్పాలి. ఢిల్లీ పెద్దల ముందు వంగి, తెలంగాణ గౌరవాన్ని తాకట్టు పెట్టే నాయకత్వాన్ని ప్రజలు ఎప్పటికీ క్షమించరు. తెలంగాణను అవమానించే ప్రతి ఒక్కరికి ప్రజాస్వామ్య పద్ధతిలో గట్టి సమాధానం ఇస్తాం. రాష్ట్ర హక్కులు, ఆత్మగౌరవంపై దాడి చేసే శక్తులను తెలంగాణ ప్రజలు ఎన్నడూ అంగీకరించరు. తెలంగాణ అంటే పోరాట గాథ... త్యాగాల చరిత్ర.. స్వాభిమానానికి ప్రతీక. దానిని అగౌరవ పరిస్తే, అవమానిస్తే సహించేది లేదు'అని హెచ్చరించారు.

## మహిళలకు 272 సీట్లు

న్యూఢిల్లీ: 'లోక్‌సభ మొత్తం సీట్ల సంఖ్య 815కు చేరుకుంటుంది. ఈ బిల్లులతో లోక్‌సభలో మహిళలకు 272 సీట్లు లభిస్తాయని చెప్పుకొచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రకారం లోక్‌సభ సభ్యుల సంఖ్య 815కు పెరుగుతుంది, అందులో మహిళలకు 272 సీట్లు కేటాయించనున్నాం' అని పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ కీలక ప్రకటన చేశారు. మహిళా రిజర్వేషన్లతో ఏ రాష్ట్రానికి గానీ, ఏ పురుషుడికి గానీ ఎలాంటి అన్యాయం జరగదని అన్నారు. డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు వీలుగా కేంద్రం 3 కీలక బిల్లులను లోక్‌సభలో కేంద్ర ప్రవేశ పెట్టింది. అనంతరం వీటిపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ,రాష్ట్ర శాసనసభలలోని మహిళా కోటాలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన మహిళలకు రిజర్వేషన్ ఉంటుందని పేర్కొన్నారు. మరోవైపు మహిళా రిజర్వేషన్ బిల్లులపై కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మహిళా కోటాను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. మూడేళ్ల క్రితం మహిళా రిజర్వేషన్ల గురించి ఏవైతే చర్చలు జరిగాయో, కేంద్రం ఇప్పుడు మళ్ళీ అవే విషయాలను చెబుతోందని ఆయన విమర్శించారు. 2023 కంటే ముందే మహిళా హక్కుల కోసం ఐదుసార్లు చట్టాలు వచ్చాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ మహిళా రిజర్వేషన్లకు అనుకూలంగానే ఉంటుందని స్పష్టం చేసిన గొగోయ్.. బిల్లు ఆమోదం పొందిన వెంటనే ఆ రిజర్వేషన్లు అమలులోకి రావాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్లను లోక్‌సభ స్థానాల పెంపుతో డీలిమిటేషన్ ముడిపెట్టడం సరికాదని ఆయన హితవు పలికారు. డీలిమిటేషన్ కమిషన్ పేరుతో మహిళలకు దక్కాల్సిన వాటాను కేంద్రం మరింత ఆలస్యం చేయాలని చూస్తోందని మండిపడ్డారు.

## ఏపీకి 38.. టీజీకి 26



న్యూఢిల్లీ: లోక్‌సభలో మహిళల రిజర్వేషన్ బిల్లుతో పాటు డీలిమిటేషన్ అంశంపై తీవ్ర చర్చ జరుగుతున్న వేళ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందనే ప్రచారం తప్పని, డీలిమిటేషన్ వల్ల ఆ రాష్ట్రాలకు తగిన రీతిలో సీట్లు పెరుగుతాయని వివరించారు. డీలిమిటేషన్‌పై విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయమూ జరగదని అమిత్ షా స్పష్టం చేశారు. డీలిమిటేషన్ తర్వాత ఏపీలో ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి పెరుగుతాయని అమిత్ షా వెల్లడించారు. అలాగే తెలంగాణలో లోక్‌సభ సీట్లు 17 నుంచి 26కి పెరుగుతాయన్నారు. ఇక, తమిళనాడులో 39 నుంచి 59కి, కర్ణాటకలో 28 నుంచి 42కి, కేరళలో 20 నుంచి 30కి సీట్లు పెరుగుతాయన్నారు. మొత్తంగా 50 శాతం సీట్లు పెరుగుతాయన్నారు. దక్షిణాది జనాభా శాతం కంటే సీట్లు ఎక్కువగా పెరుగుతాయని అమిత్ షా చెప్పారు. విపక్షాలు అబద్ధాలు చెబుతూ ప్రజలను అనవసరంగా ఆందోళనకు గురి చేస్తున్నాయన్నారు. అన్ని ప్రాంతాలకూ సమాన న్యాయం జరుగుతుందని తేల్చి చెప్పారు. ప్రస్తుతం 543 ఉన్న లోక్‌సభ సీట్లను డీలిమిటేషన్ తర్వాత దాదాపు 50% పెంచి 850 వరకు తీసుకెళ్లే ప్రణాళిక ఉందని కేంద్రం తెలిపింది.

## బీజేపీ నరనరాన విషం

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీ చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ సమాజం గుర్తు పెట్టుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం అనేది ఎవరి దయాదాక్షిణ్యాల వల్లనో, ఎవరి భిక్ష వల్లనో ఏర్పడింది కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. దశాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ పోరాటం, వేలాది మంది యువకుల బలిదానాల ఫలితంగా ఈ గడ్డ విముక్తి పొందిందని గుర్తు చేశారు. అస్తిత్వం కోసం ప్రజలు చేసిన ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాన్ని దేశ విభజన లాంటి విషాదకర సంఘటనలతో పోల్చడం ద్వారా బీజేపీ తన కుసంస్కారాన్ని బయటపెట్టుకుందని విమర్శించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని ఆయన హెచ్చరించారు. పార్లమెంటు సాక్షిగా తోటి ఎంపీ తెలంగాణపై విషం చిమ్ముతున్నా, అక్కడే ఉన్న ఎనిమిది మంది తెలంగాణ బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అత్యంత సిగ్గుచేటని కేటీఆర్ దుయ్యబట్టారు. కనీసం తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ఎంపీలు సైతం బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలను ఖండించకుండా మౌనంగా ఉండడం దారుణం అన్నారు. తమ కళ్ల ముందే తెలంగాణను అవమానిస్తున్నా అడ్డుకోలేకపోయిన వీరు, ప్రజలకు ఏ ముఖం పెట్టుకుని సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తున్న ఎంపీల వైఖరిని తెలంగాణ సమాజం గమనిస్తోందన్నారు. తెలంగాణను కించపరిచిన తేజస్వి సూర్య తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు బీజేపీ పార్టీ కూడా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని , లేకుంటే తేజస్వి సూర్య వ్యాఖ్యలే బీజేపీ అధికారిక విధానంగా భావించాల్సి వస్తుందన్నారు.

## ఏ మతాన్ని ఏమనగలం?

(మొదటి పేజీ తరువాయి)

న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని బెంచ్ ప్రస్తుతం శబరిమల కేసుకు సంబంధించిన కీలక రాజ్యాంగ ప్రశ్నలపై వాదనలు వింటోంది. ముఖ్యంగా మత స్వేచ్ఛ, సామాజిక సంస్కరణ మధ్య సమతుల్యతపై చర్చ జరుగుతోంది. 2018లో సుప్రీంకోర్టు అన్ని వయస్సుల మహిళలకు శబరిమల ఆలయంలో ప్రవేశం ఇవ్వాలని తీర్పు ఇచ్చింది. పరిమితులను అత్యవసర మత ఆచారంగా పరిగణించలేమని ఐదుగురు న్యాయమూర్తుల బెంచ్ తెలిపింది. 10 నుంచి 50 సంవత్సరాల మధ్య మహిళలు, బాలికలు ఆలయంలోకి రాకూడదనే ఆచారాన్ని దాదాపు అంటరానితనంతో సమానమని పేర్కొంది. తాజాగా జరిగిన విచారణ సమయంలో మత సంబంధిత విషయాల్లో ప్రజాహిత వ్యాజ్యాల నిర్వహణ సాధ్యాసాధ్యాలపై వాదనలకు స్పందిస్తూ.. లక్షలాది మంది నమ్మకాల్ని తప్పు అని కోర్టు ఎలా ప్రకటించాలన్నదే అత్యంత కఠినమైన సమస్యగా ఉందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ వ్యాఖ్యానించారు. కోట్లాది మంది భక్తుల విశ్వాసాన్ని అనుచితమని ప్రకటించడం న్యాయస్థానాలకు కష్టమైన పనేనని తెలిపారు. ట్రావెన్కోర్ దేవస్థాన మండలి తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. మతంపై నమ్మకం లేని వారు వాటిని ప్రశ్నిస్తూ దాఖలు చేసే పిటిషన్లను విచారణకు స్వీకరించడం సరైనదేనా? అని అన్నారు. అయ్యప్ప ఆలయాలు ఎన్ని ఉన్నా శబరిమలలోని చాలా విశిష్టమైనదని తెలిపారు. ఆచారాలను మహిళలపై వివక్షగా భావించొద్దని అన్నారు. 10-50 ఏళ్ల మధ్య వయసున్న బాలికలు, మహిళల ప్రవేశంపై మాత్రమే ఆంక్షలున్నాయని చెప్పారు.

## దేశ విభజనలా తెలంగాణ విభజన

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలు కూడా నవ్వుతున్నారని బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య అన్నారు. రాష్ట్రాల జీఎస్‌డీపీ ఆధారంగా లోక్ సభ సీట్ల సంఖ్యను పెంచాలన్న రేవంత్ రెడ్డి ప్రతిపాదనపై ఆయన మండిపడ్డారు. సీట్ల పెంపునకు, జీఎస్‌డీపీ ముడిపెట్టాలన్న తెలంగాణ సీఎం సలహా అత్యంత మూర్ఖంగా ఉందని అన్నారు. అసలు ఆయనకు ఆ సలహా ఎవరిచ్చారో కానీ అందరూ నవ్వుతున్నారని ఎద్దేవా చేశారు. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న విపక్ష పార్టీలు, దక్షిణాది పార్టీల వ్యాఖ్యలను సూర్య తప్పుబట్టారు. డీలిమిటేషన్‌పై విపక్షాల వాదన అర్థరహితంగా ఉందని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని హామీ ఇచ్చారు. డీలిమిటేషన్‌పై ప్రతిపక్షాలు దక్షిణాది రాష్ట్రాల ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాల ఆదాయం అనేది ప్రతి సంవత్సరం మారుతుందని తెలిపారు. దానిని డీలిమిటేషన్‌కు ప్రాతిపదికగా తీసుకోవాలని చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. ఆదాయం ప్రకారం ఓట్లు లేదా ప్రాతినిధ్యం ఇవ్వాలనుకుంటే దేశంలో అత్యధిక ఆదాయం ఉన్న అంబానీకి లక్ష ఓట్లు ఇవ్వవలసి వస్తుందని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వాలు మహిళా రిజర్వేషన్ బిల్లును పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పుడు కూడా మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడానికే చూస్తున్నాయని అన్నారు. డీలిమిటేషన్‌ను సాకుగా చూపి మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును వేగంగా అమలు చేద్దామంటే విపక్షాలు యూటర్న్ తీసుకుంటున్నాయని అన్నారు.

## పెళ్లికి బంగారం, పట్టుచీర
# రైతులకు రుణమాఫీ

(మొదటి పేజీ తరువాయి)

బంగారం, ఓ పట్టుచీర కానుకగా ఇస్తామన్నారు. ఐదు ఎకరాల కంటే తక్కువ భూమి ఉన్న రైతుల వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామన్నారు. స్వయం సహాయక బృందాలకు రూ.5 లక్షలు వడ్డీ లేని రుణాలు, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో డ్రాపవుట్‌లను నిర్మూలించేందుకు విద్యార్థుల తల్లులకు ఏడాదికి రూ.15 వేలు ఆర్థిక సహాయం చేస్తామన్నారు. అలాగే ఐదు ఎకరాల కంటే తక్కువ భూమి ఉన్న రైతుల రుణాలను పూర్తిగా మాఫీ చేస్తామన్నారు. ఐదు ఎకరాల కంటే ఎక్కువ భూమి కలిగిన రైతుల రుణాలను 50 శాతం మాఫీ చేస్తామన్నారు. అలాగే ఓ కుటుంబానికి ఏడాదికి ఉచితంగా ఆరు గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్నారు. పట్టభద్రులైన నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల ఆర్థిక సహాయం చేస్తామన్నారు. అలాగే కొత్తగా ఐదు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు తీస్తామన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు నెలకు రూ.3 వేల పింఛను ఇస్తామన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, కుటుంబానికి 25 లక్షల ఆరోగ్య బీమా, ఏఐ మంత్రిత్వ శాఖ, ఏఐ యూనివర్సిటీ, ఏఐ సిటీ ఏర్పాటు చేస్తామని విజయ్ హామీల వర్షం కురిపించారు. అలాగే మహిళలు తమ ఇళ్ల ముందు టీవీకే పార్టీ గుర్తు అయిన విజిల్ ముగ్గు వేయాలని సూచించారు.

## తేజస్వీ తెలివి లేని వెధవ: మంత్రి పొన్నం ఫైర్

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఈవార్తలు): బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలపై తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తేజస్వీ సూర్యను తెలివి లేని వెధవ అంటూ మండిపడ్డారు. రాజ్యాంగబద్ధంగా, బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన ఆర్టికల్ 3 ప్రకారం ఏర్పడిన తెలంగాణను.. దేశ విభజనతో పోల్చుతారా? అని ప్రశ్నించారు. నాలుగు దశాబ్దాల తెలంగాణ ప్రజల ఆకాంక్షను గౌరవించి కాంగ్రెస్ రాష్ట్రం ఇస్తే, బీజేపీ ఎంపీలు దాన్ని అవహేళన చేయడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. తెలంగాణ ఏర్పాటును ఇంతలా అవమానిస్తుంటే.. రాష్ట్ర బీజేపీ నేతలకు చీము నెత్తురు లేదా? అని పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. పార్లమెంట్‌లో తమ రాష్ట్రం అవమానానికి గురవుతుంటే తెలంగాణ బీజేపీ ఎంపీలు ఏం చేస్తున్నారని నిలదీశారు.

## కాళ్లకు పొక్కులు భానుడి భగభగలు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఈవార్తలు): రాష్ట్రవ్యాప్తంగా ఎండలు ఠారెత్తిస్తున్నాయి. గురువారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 43.8 డిగ్రీలు, నిజామాబాద్ జిల్లాలో 42.7, మహబూబ్‌నగర్‌లో 42, రామగుండంలో 42 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శుక్ర, శనివారాల్లోనూ ఉత్తర, దక్షిణ తెలంగాణలో ఎండల తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. రానున్న మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమేపీ 1 నుంచి 2 డిగ్రీలు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలిపింది. మరోవైపు ఈ నెల 19 నుంచి 23 వరకు ఐదు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. దిగువస్థాయి గాలుల్లో మార్పు, క్యుములోనింబస్ మేఘాలు, ద్రోణి ప్రభావాలతో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది.

# సర్‌తో జాగ్రత్త!




## కాంగ్రెస్, బీజేపీ అక్రమాలను అడ్డుకుందాం
## బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ దిశానిర్దేశం

త్వరలో తెలంగాణలో జరగనున్న ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం పైన దృష్టి సారించి, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ అధికారాన్ని అడ్డం పెట్టుకొని అక్రమాలకు పాల్పడకుండా చూడాలని భారత రాష్ట్ర సమితి పార్టీ శ్రేణులకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు.

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఈవార్తలు): ఇప్పటికే ఎన్నికల సంఘం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని అడ్డం పెట్టుకొని అనేక రాష్ట్రాల్లో లక్షలాది ప్రతిపక్ష పార్టీల ఓట్లను బీజేపీ తీసివేసిందన్న ఆరోపణలు విస్తృతంగా తలెత్తుతున్నాయన్నారు. దీనితో పాటు తాజాగా మొన్నటి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లు చేర్పించి కాంగ్రెస్ పార్టీ అడ్డగోలుగా లబ్ధి పొందిన విషయాన్ని గుర్తుంచుకోవాలని కేటీఆర్ పార్టీ శ్రేణులకు గుర్తు చేశారు. అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్‌లు ఖచ్చితంగా ఈ సర్ కార్యక్రమాన్ని దుర్వినియోగం చేసే ప్రమాదం రాష్ట్రంలో ఉన్నదని, దీని పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. భారత రాష్ట్ర సమితి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు తమ ఓట్లను కాపాడుకోవడంతో పాటు దొంగ ఓట్లు నమోదు కాకుండా చూడాలన్నారు. త్వరలో జరగనున్న సర్ కార్యక్రమంపై పార్టీ శ్రేణులకు గురువారం టెలికాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. ఈ మొత్తం సర్ ద్వారా ఓటర్ల జాబితాలోని తప్పులను సవరించి కొత్తగా ఓటర్లను నమోదు చేసేందుకు ఉద్దేశించిందని, కాబట్టి ప్రతీ బూత్ వారీగా దొంగ ఓటర్లను తొలగించేందుకు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీంతోపాటు 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్క యువకుడిని ఓటరుగా నమోదు చేయించేందుకు పార్టీ తరఫున నియమించబడే బూత్ లెవల్ ఏజెంట్లు ప్రయత్నం చేయాలన్నారు. సర్ మార్గదర్శకాల ప్రకారం బూత్ లెవల్ అధికారులతో కలిసి సమన్వయం చేసుకునేందుకు పార్టీ తరఫున బూత్ లెవల్ ఏజెంట్ల నియామకానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కేటీఆర్ సూచించారు. ఈ మొత్తం బూత్ లెవల్ ఏజెంట్ల ఎంపిక, వారి వివరాలను ప్రభుత్వానికి, ఎన్నికల కమిషన్‌కు అందించి వారి నియామకం వెంటనే




పూర్తయ్యేలా చూసుకోవాలన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లకు పార్టీ తరఫున ఒక శిక్షణ కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తామని కేటీఆర్ తెలిపారు. దీంతోపాటు రాష్ట్రంలో సర్ ఎప్పుడైనా వారం పది రోజుల్లోనే ప్రారంభం అయ్యే అవకాశం ఉన్నదని, ప్రారంభమైన వెంటనే వేగంగా పూర్తయ్యే అవకాశం ఉంది కాబట్టి ఓటర్ల జాబితా తయారీ, సవరణ వంటి అంశాల పైన ఇప్పటి నుంచే పార్టీ కసరత్తు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సర్ ప్రాధాన్యత, సర్ నిర్వహించే తీరు, అందులో బూత్ లెవల్ ఏజెంట్లు చేయవలసిన విధులు, బాధ్యతలను కేటీఆర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. బూత్ లెవల్ ఏజెంట్లు ప్రభుత్వం చేత నియమించబడే బూత్ లెవల్ ఆఫీసర్లతో సమన్వయం చేసుకోవడం, కొత్త ఓటర్ల నమోదు, అనర్హుల తొలగింపు, ఓటర్ల జాబితాలోని తప్పుల సవరణ వంటి ప్రధానమైనటువంటి కార్యక్రమాలు చేపట్టవలసి ఉంటుందన్నారు. సర్ అనేది రానున్న ఎన్నికలకు అత్యంత కీలకం అని కేటీఆర్ తెలిపారు. దీనికి సంబంధించి ప్రతి ఒక్క ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ బూత్ స్థాయి నుంచి సరిగ్గా సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. సర్ పైన దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో జరిగిన వివాదాలు, చర్చలు, అధికార దుర్వినియోగం వంటి ఆరోపణలను, విమర్శలను దృష్టిలో ఉంచుకొని అలాంటి అవకాశం స్థానికంగా ఉన్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఇవ్వకుండా ప్రజాస్వామ్యయుతంగా అందరి ఓటు హక్కుని కాపాడుకుంటూ ముందుకు సాగేలా ప్రయత్నం చేయాలని మరొకసారి గుర్తు చేశారు.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## ఒకాయన 10 పర్సెంట్ మంత్రి

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఈవార్తలు): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనితీరు, ఆయన మంత్రివర్గంపై వస్తున్న అవినీతి ఆరోపణలపై మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వ్యవస్థలో తమకు జరుగుతున్న అన్యాయాన్ని, అవమానాన్ని చక్కదిద్దే స్థితిలో ముఖ్యమంత్రి లేరని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో ఒక మంత్రికి '10 పర్సెంట్ మంత్రి' అనే పేరు ముద్ర పడిపోయిందని, ఏ మూలకెళ్లి అడిగినా జనం ఆయన పేరే చెబుతున్నారని మోత్కుపల్లి ఆరోపించారు. ఇంత బహిరంగంగా అవినీతి జరుగుతున్నా, సదరు మంత్రిపై చర్యలు తీసుకోవడానికి రేవంత్ రెడ్డి ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. ఎస్సీ, బీసీ, ఓసీ ఎవరైనా సరే అవినీతిపరుడిని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఒక్కడే కష్టపడితే సరిపోదని అన్నారు. సీఎం వెనుక ఉండి గోతులు తవ్వే 'నల్లికుట్లోళ్లు' ఎవరో రేవంత్‌కు తెలియదా? అని నిలదీశారు. ప్రభుత్వం కూలిపోవడానికి సిద్ధంగా ఉందని, సొంత పార్టీలోనే కుట్రలు జరుగుతున్నా సీఎం మౌనంగా ఉండటం వెనుక అర్థమేంటని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ జరిగిన తర్వాత కూడా, ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా కొందరు సమావేశాలు పెడుతున్నా ఏమీ చేయలేకపోతున్నారని విమర్శించారు. కేవలం ముఖ్యమంత్రి పదవిని కాపాడుకోవడమే ధ్యేయంగా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని, ప్రజలు వెంట ఉండాలంటే ముందు అవినీతికి అంతం పలకాలని హితవు పలికారు.

# సిగ్గులేకుండా సమర్థిస్తావా?

**రాంచందర్ రావుపై జాన్‌వెస్లీ ఫైర్**



హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఈవార్తలు): పార్లమెంట్ సాక్షిగా బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును, భారత దేశ విభజనతో పోలుస్తూ చేసిన వ్యాఖ్యలను సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పేర్కొన్నారు. బ్రిటిష్ వారు భారతదేశాన్ని, పాకిస్తాన్‌ను విడగొట్టిన పద్ధతిలోనే ఆంధ్రా–తెలంగాణ విభజన జరిగిందని తేజస్వీ సూర్య మాట్లాడటం ఆయన అజ్ఞానానికి, తెలుగు ప్రజల పట్ల ఉన్న చులకన భావానికి నిదర్శనమని, దశాబ్దాల పోరాటాలు, వందలాది మంది బలిదానాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణను ఒక దేశ విభజన నాటి రక్తపాతంతో పోల్చడం అత్యంత హేయమని అన్నారు. ఒకవైపు తామే తెలంగాణ ఇచ్చామని, ఇక్కడ 'విమోచన దినోత్సవాలు' జరుపుకుంటామని చెప్పుకునే బీజేపీ నాయకులు పార్లమెంటులో మాత్రం రాష్ట్ర ఏర్పాటును అవమానపరిచేలా మాట్లాడటం వారి రెండు నాలుకల ధోరణికి నిదర్శనమని, నాడు బిల్లుకు మద్దతు పలికిన వెంకయ్య నాయుడు, సుష్మా స్వరాజ్ వంటి నేతల నిర్ణయాలను ఇప్పుడు తేజస్వీ సూర్య తప్పుబడుతున్నారా? అని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) వంటి కీలక అంశాలపై చర్చ జరుగుతున్నప్పుడు, దక్షిణాది రాష్ట్రాల హక్కుల గురించి మాట్లాడకుండా.. ఇలాంటి విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం ద్వారా చర్చను పక్కదారి పట్టించాలని బీజేపీ చూస్తోందని విమర్శించారు. కేంద్ర మంత్రులుగా ఉన్న తెలంగాణ బీజేపీ నేతలు తమ పార్టీ ఎంపీ రాష్ట్రాన్ని అవమానిస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారు? రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కూడా ఈ వ్యాఖ్యలను సమర్థించేలా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, తెలుగు ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## ముస్లిం ప్రాతినిథ్యం తగ్గించేలా మహిళా బిల్లు

మేం వ్యతిరేకిస్తున్నా: అసదుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఈవార్తలు): మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించారు. ఈ బిల్లును నిరసిస్తూ ఆయన సాహిర్ లుధియాన్వి రాసిన ఒక కవితను లోక్ సభలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా అసదుద్దీన్ మాట్లాడుతూ, మహిళా రిజర్వేషన్ బిల్లును సభలో ప్రవేశపెట్టడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఈ చర్య మహిళా రిజర్వేషన్‌కు సంబంధించినది కాదని, ముస్లిం ప్రాతినిథ్యాన్ని తుడిచివేసే చర్య అని ఆరోపించారు. ఈ బిల్లు జనాభా ఎక్కువగా ఉన్నరాష్ట్రాలకు మరింత అధికారం ఇస్తుందని అన్నారు. డీలిమిటేషన్ బిల్లుపై ఆయన మాట్లాడుతూ, బిల్లు ప్రజాస్వామ్య, సమాఖ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఉందని విమర్శించారు. దక్షిణాది ప్రాంతాలకు సభలో ప్రాతినిథ్యం లేకుండా ఈ బిల్లు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, డీలిమిటేషన్ బిల్లును కాంగ్రెస్, ఎస్పీ, డీఎంకే సహా వివిధ పార్టీలు వ్యతిరేకించాయి.

## డీలిమిటేషన్ చట్టం చేసింది కాంగ్రెస్సే: ఏలేటి

హైదరాబాద్, ఏప్రిల్ 15 (ఈవార్తలు): డీలిమిటేషన్ బిల్లుతో తెలంగాణ సహా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందనే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల విమర్శలపై బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పందించారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరగాలని కాంగ్రెస్ ప్రభుత్వాలే చట్టాలు తెచ్చాయని అన్నారు. 1972లో కాంగ్రెస్ చేసిన డీలిమిటేషన్ వల్ల నాడు ఆంధ్రప్రదేశ్‌లో ఒక లోక్ సభ సీటు తగ్గిందని గుర్తు చేశారు.



## రాజ్యసభ సభ్యుడిగా వేం నరేందర్ రెడ్డి ప్రమాణం

న్యూఢిల్లీ: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నాయకుడు వేం నరేందర్ రెడ్డి గురువారం రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల పలువురు నేతలు రాజ్యసభకు ఎన్నికైన విషయం తెలిసిందే. కొత్తగా ఎన్నికైన సభ్యులు ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం, వేం నరేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, తన మీద నమ్మకంతో రాజ్యసభ ఎంపీగా అవకాశం ఇచ్చినందుకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రజలు, సమస్యలు, రాష్ట్ర హక్కులు, రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి పార్లమెంటులో పోరాటం చేస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల వికాసం, అభివృద్ధి కోసం శాయశక్తులా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, తెలంగాణ నుంచి ఎన్నికైన మరో కాంగ్రెస్ నాయకుడు అభిషేక్ మను సింఘ్వీ తదితరులు కూడా ఇవాళ ప్రమాణ స్వీకారం చేశారు.



## కేరళలో లోక్ సభ స్థానాలను తగ్గించమని రేవంత్ రెడ్డి కోరాలి: రాంచందర్ రావు


తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు సవాల్ విసిరారు. కేరళలో 20 లోక్ సభ స్థానాలు ఉంటే, తెలంగాణలో 17 మాత్రమే ఉన్నాయని గుర్తు చేశారు. మొదట కేరళలో లోక్ సభ సీట్లను తగ్గించాలని రేవంత్ రెడ్డి అడగాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు జనాభా అధికంగా ఉన్న రాష్ట్రాలకు తక్కువ సీట్లు ఇచ్చారని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్‌లు అమలు చేయాలని, డీలిమిటేషన్ చేపట్టాలని లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ కొత్త పార్లమెంటు భవనంలోనే కోరారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు వారే వ్యతిరేకిస్తున్నారని మండిపడ్డారు. 543 సీట్లలోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని కాంగ్రెస్ ఇప్పుడు కోరడం విడ్డూరంగా ఉందని అన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో కుటుంబ నియంత్రణ పాటించడం వల్ల జనాభా తగ్గిందని, ఉత్తరాదిన పాటించలేదని రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి వింత వాదన చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

# స్టాండప్ కమెడియన్‌పై చర్యలు తీసుకోండి

**హైదరాబాద్ సీపీ సజ్జనార్ కు ఫిర్యాదు**



హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఈవార్తలు): స్టాండప్ కామెడీ పేరుతో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రామ్ చరణ్, నిహారిక వ్యక్తిగత జీవితాలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కమెడియన్ అనుదీప్ కటికలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ మెగా అభిమాన సంఘాల నేతలు హైదరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన అఖిల భారత చిరంజీవి యువత, తెలంగాణ చిరంజీవి యువత ప్రతినిధులు నేడు వీసీ సజ్జనార్ ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు రవణం స్వామినాయుడు, తెలంగాణ చిరంజీవి యువత అధ్యక్షుడు వెల్పుల వెంకటేష్ ఆధ్వర్యంలో పలువురు సజ్జనార్ తో సమావేశమై ఫిర్యాదు అందజేశారు. వారి ఫిర్యాదుపై స్పందించిన సజ్జనార్, ఈ విషయంపై వెంటనే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనుదీప్‌తో పాటు మరికొందరు స్టాండప్ కమెడియన్లు కూడా మెగా ఫ్యామిలీని కించపరిచేలా వ్యాఖ్యలు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని చిరంజీవి యువత నాయకులు తెలిపారు. ఇకపై మెగా ఫ్యామిలీపై ఎవరైనా వ్యక్తిగత దాడులకు పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు. కామెడీకి, వ్యక్తిగత దూషణలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించాలని వారు స్పష్టం చేశారు. కాగా, స్టాండప్ కమెడియన్ అనుదీప్ ను ఏపీ పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేయడం తెలిసిందే. కుటుంబ సభ్యులను కలవడానికి ప్రయాగ్ రాజ్ వెళ్లిన అతడిని ఏపీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల అతడు పవన్, నిహారికల వ్యక్తిగత జీవితాలు, విడాకులపై వ్యంగ్యంగా స్కిట్ చేశాడు. దాంతో అతడిపై మెగా అభిమానులు, జనసైనికులు

# పూలే ద్విశత జయంతి కమిటీలో ఆర్ కృష్ణయ్య

**బీసీ ఉద్యమానికి జాతీయ గౌరవం.. మోదీ అధ్యక్షతన కమిటీ ఏర్పాటు .. దశాబ్దాల పోరాటానికి గుర్తింపు బీసీ సాధికారతకు కొత్త దిశ**

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఈవార్తలు): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన నిర్వహించబడనున్న మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశత జయంతి ఉత్సవాల జాతీయ కమిటీలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య (టైగర్ ఆర్. కృష్ణన్న) సభ్యునిగా ఎంపిక కావడం విశేష ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఈ ప్రతిష్టాత్మక కమిటీలో మాజీ రాష్ట్రపతులు, మాజీ ప్రధానులు, లోక్‌సభ స్పీకర్‌తో పాటు 34 మంది కేంద్ర మంత్రులు, 25 రాష్ట్రాల ముఖ్యమంత్రులు భాగస్వాములవడం ఈ ఉత్సవాల విస్తృతిని స్పష్టంగా తెలియజేస్తోంది. బీసీ వర్గాల హక్కుల సాధన కోసం దశాబ్దాలుగా నిరంతర పోరాటం సాగించిన ఆర్. కృష్ణయ్యకు ఈ కమిటీలో స్థానం కల్పించడం గౌరవప్రదమైన నిర్ణయమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం పేర్కొన్నారు. బీసీ ఉద్యమ చరిత్రలో ఆర్. కృష్ణయ్య పోరాటాలు కీలక మలుపు తిప్పాయని ఆయన వివరించారు. దేశంలో ఎక్కడ లేనివిధంగా బీసీ విద్యార్థుల కోసం గురుకుల విద్యాసంస్థలు, బీసీ హాస్టల్స్ ఏర్పాటు చేయించడంలో ఆయన పోరాటం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. గ్రామీణ, పేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు ఈ సంస్థలు పెద్ద ఎత్తున దోహదపడ్డాయని తెలిపారు. అలాగే, బీసీ విద్యార్థులు చదువుకుంటేనే సమాజంలో చైతన్యం పెరిగి, ఆ



చైతన్యం వారిని రాజ్యాధికార వైపు దారితీస్తుందనే దృఢ నమ్మకంతో ఆర్. కృష్ణయ్య ఉద్యమాలను ముందుకు నడిపారని గుజ్జ సత్యం స్పష్టం చేశారు. ఈ దిశగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, కోచింగ్ సదుపాయాలు, హాస్టల్స్ వంటి అనేక సంక్షేమ పథకాలను సాధించడం ఆయన ఉద్యమ విజయాల ప్రతిఫలమని పేర్కొన్నారు. ఈ చర్యలు లక్షలాది బీసీ విద్యార్థుల భవిష్యత్తును మార్చడంతో పాటు, సమాజంలో విద్యా సమానత్వాన్ని బలోపేతం చేశాయని ఆయన అభిప్రాయపడ్డారు. 2028 ఏప్రిల్ 11 వరకు కొనసాగనున్న ఈ కమిటీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పూలే ద్విశత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో, ఆర్. కృష్ణయ్య నాయకత్వంలో ఈ వేడుకలను విజయవంతం చేయాలని గుజ్జ సత్యం పిలుపునిచ్చారు. "బీసీలు విద్యతో చైతన్యవంతులై రాజ్యాధికారంలో భాగస్వాములు కావాలన్న లక్ష్యంతో సాగిన ఉద్యమం నేడు ఫలితాలను ఇస్తోంది. ఈ వేడుకలు ఆ దిశగా మరింత ప్రేరణనిస్తాయి" అని గుజ్జ సత్యం పేర్కొన్నారు.



## కొండగట్టు అంజన్న సన్నిధిలో పదవీ బాధ్యతలు

**జగిత్యాల ఫస్ట్ అదనపు సెషన్స్ జడ్జి కీలక నిర్ణయం**

మల్యాల, ఏప్రిల్ 16 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారి సన్నిధిలో జగిత్యాల ఫస్ట్ అదనపు సెషన్స్ జడ్జి సునీత రవీందర్ రెడ్డి బాధ్యతలను స్వీకరించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు స్వస్తి వేదమంత్రాలతో జడ్జి దంపతులను ఆహ్వానించారు. అనంతరం వారు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం స్వామివారి సాక్షిగా జడ్జి తన బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ స్థానాచారి కపిందర్ జడ్జి దంపతులకు శేషవస్త్రం కప్పి, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు అధికారులు, స్థానిక పోలీసులు టెంపుల్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 23 నుంచి సంజీవని ఆసుపత్రిలో బాల హృదయ ఉచిత శిబిరం

కొండపాక, ఏప్రిల్ 16 (ఈవార్తలు): సిద్దిపేట జిల్లా కొండపాక శివారులోని శ్రీసత్యసాయి సంజీవని బాల ఉదయ సంరక్షణ పరిశోధన కేంద్రంలో ఈ నెల 23 నుంచి 25 వరకు ఉచిత పిల్లల గుండె స్క్రీనింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 నుంచి 4 గంటల వరకు శిబిరం జరుగుతుందని తెలిపారు. ఆసుపత్రిలో స్క్రీనింగ్‌తో పాటు ఆపరేషన్ పూర్తిగా ఉచితమని తెలిపారు. పూర్తి వివరాల కోసం మొబైల్ నంబర్ 8010119000, వాట్సాప్ 7075137733 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

## విశాఖ యువతి ఆత్మహత్య.. ఆరుగురు అరెస్ట్

విశాఖపట్నం, ఏప్రిల్ 16 (ఈవార్తలు): ఏపీలోని విశాఖపట్నంలో తీవ్ర కలకలం రేపిన ఘటనలో, స్నేహితులు తనపై దాడి చేశారన్న అవమానభారంతో ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. పుట్టినరోజు వేడుకలో జరిగిన ఈ ఘోరానికి సంబంధించి ఆరుగురు స్నేహితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. జోడుగుళ్లపాలెంకు చెందిన శాంతికుమారి (27) తన స్నేహితులతో కలిసి ఏప్రిల్ 14న రాత్రి విశాలాక్షినగర్‌లోని ఓ లాడ్జిలో పుట్టినరోజు వేడుకలు జరుపుకుంది. ఈ పార్టీలో అందరూ మద్యం సేవించారు. ఈ క్రమంలో, తన గురించి శాంతికుమారి తప్పుడు ప్రచారం చేస్తోందని సాయికిరణ్ అనే స్నేహితుడు ఆరోపించడంతో వారి మధ్య గొడవ మొదలైంది. మాటామాటా పెరగడంతో ఆగ్రహానికి లోనైన సాయికిరణ్, యశ్వంత్, లక్ష్మీ సౌజన్య కలిసి శాంతికుమారిపై దాడి చేశారు. స్నేహితుల దాడితో తీవ్ర మనస్తాపానికి గురైన శాంతికుమారి, లాడ్జిలోని మరో గదిలోకి వెళ్లి తలుపు వేసుకుంది. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన స్నేహితులు తలుపులు పగలగొట్టి చూడగా, ఆమె ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే ఆసుపత్రికి తరలించినా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న శాంతికుమారి తల్లి రమ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## వాహన డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు

జగిత్యాల, ఏప్రిల్ 16 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించి, ప్రజలందరికీ సురక్షితమైన ప్రయాణాన్ని కల్పించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం అన్ని పోలీస్ స్టేషన్ పరిధుల్లో వాహన డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షల శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ, "జిల్లా వ్యాప్తంగా డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడం, గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యం. రోడ్డు ప్రమాదాలు ఎప్పుడు, ఎలా జరుగుతాయో ముందుగా ఊహించలేము. చిన్న చిన్న నిర్లక్ష్యాలే పెద్ద ప్రమాదాలకు దారితీస్తాయి. అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ వాడటం, చూపు సమస్యలను నిర్లక్ష్యం చేయడం వంటి కారణాల వల్లే రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం సంభవిస్తున్నాయి" అని తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనాలు నడిపే డ్రైవర్లు, దీర్ఘదూర ప్రయాణాలు చేసే లారీ, బస్సు డ్రైవర్లు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.



## అగ్నిమాపక వారోత్సవాల్లో రక్తదాన శిబిరం

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 16 (ఈవార్తలు): అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని జగిత్యాల జిల్లా కేంద్రంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా అగ్నిమాపక కేంద్రం ఆవరణలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సైదులు ఆధ్వర్యంలో, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బీఎస్ లత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రక్తదానం పట్ల ఎలాంటి అపోహలు లేదా అనుమానాలు అక్కరలేదని, ప్రతి ఒక్కరూ ప్రతి మూడు నెలలకొకసారి రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. అగ్నిప్రమాదాలు, విపత్తుల సమయంలో క్షణాల్లో ఘటనా స్థలానికి చేరుకొని ఆస్తులు, ప్రాణాలను కాపాడడంలో అగ్నిమాపక సిబ్బంది కీలకపాత్ర పోషిస్తున్నారని, వారిని ముందుకు నడిపించే అధికారులు అసలైన రియల్ హీరోలని అన్నారు. అనంతరం అగ్నిమాపక శాఖలో



అమరులైన వీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. ఈ రక్తదాన శిబిరంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సైదులుతో పాటు 23 మంది అగ్నిమాపక అధికారులు, సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి మంచాల కృష్ణ, సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్, కొమురవెల్లి వేణుగోపాల్, జగిత్యాల, ధర్మపురి అగ్నిమాపక కేంద్రాల అధికారులు కృష్ణకాంత్, శ్రీకాంత్, బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నేత పూడి శ్రీహరికి బెయిల్

విజయవాడ, ఏప్రిల్ 16 (ఈవార్తలు): ముఖ్యమంత్రి చంద్రబాబుపై సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్ట్ పెట్టారన్న ఆరోపణలతో అరెస్టయిన వైసీపీ ప్రధాన కార్యదర్శి (మీడియా విభాగం) పూడి శ్రీహరికి ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు కుప్పం కోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. బుధవారం ఉదయం విజయవాడలోని ఆయన నివాసంలో అదుపులోకి తీసుకున్న పోలీసులు, అనంతరం కుప్పంకు తరలించిన విషయం తెలిసిందే. బెయిల్ లభించిన అనంతరం శ్రీహరి మీడియాతో మాట్లాడారు. వివాదాస్పదమైన కంటెంట్‌ను తాను సృష్టించలేదని, పోస్ట్ చేయలేదని, ఫార్వార్డ్ కూడా చేయలేదని స్పష్టం చేశారు. 25 ఏళ్లుగా సీనియర్ జర్నలిస్టుగా చట్టానికి లోబడే పనిచేశానని, తనపై గతంలో ఎలాంటి కేసులు లేవని తెలిపారు. పోలీసులు అడిగిన సమాచారం మొత్తం ఇచ్చానని, భవిష్యత్తులోనూ విచారణకు పూర్తిగా సహకరిస్తానని వివరించారు. ఈ అరెస్టుపై వైసీపీ నేతలు తీవ్రంగా స్పందించారు. శ్రీహరిని పోలీసులు అక్రమంగా, నిబంధనలకు విరుద్ధంగా నిర్బంధించారని పార్టీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి పొన్నవోలు సుధాకర్ రెడ్డి ఆరోపించారు. పార్టీ అందించిన న్యాయ సహాయంతోనే బెయిల్ సాధ్యమైందని తెలిపారు. ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ మాట్లాడుతూ, ఈ అరెస్టు కేవలం వేధించేందుకేనని, చట్టపరంగా ఈ కేసు నిలబడదని అన్నారు.





# దారికొస్తే సరే.. లేకపోతే దాడే!



## ఇంధన వనరులను టార్గెట్ చేస్తాం.. ఇరాన్‌కు అమెరికా హెచ్చరికలు

**అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్రస్థాయికి చేరాయి. ఇరాన్‌పై కఠినమైన నావికాదళ దిగ్బంధనాన్ని అమలు చేస్తున్నామని, తెలివిగా నిర్ణయం తీసుకోవాలని గురువారం అమెరికా తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. అవసరమైతే సైనిక చర్యను మరింత తీవ్రతరం చేయడానికి తమ బలగాలు 'లాక్ అండ్ లోడ్'తో సిద్ధంగా ఉన్నాయని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ స్పష్టం చేశారు. పెంటగాన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.**

**ఆయనతో పాటు జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్, ఎయిర్ ఫోర్స్ జనరల్ డాన్ కెయిన్, యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) కమాండర్ అడ్మిరల్ బ్రాడ్లీ కూపర్ కూడా పాల్గొన్నారు. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'గా పిలుస్తున్న సైనిక చర్య తర్వాత ఇరు దేశాల మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉంది. ఈ నేపథ్యంలోనే అమెరికా ఈ హెచ్చరికలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.**

వాషింగ్టన్: ఇరాన్ ఓడరేవులు, తీరప్రాంతంపై దిగ్బంధనం ఇప్పటికే అమల్లో ఉందని, దీన్ని నిరవధికంగా కొనసాగించగలమని హెగ్సెత్ తెలిపారు. "మీ ఇంధనం కదలడం లేదు, ఇకపై కదలదు కూడా. ఇది మర్యాదపూర్వకంగా జరిగే విధానం" అని ఆయన వ్యాఖ్యానించారు. ఏ దేశానికి చెందిన నౌక అయినా ఇరాన్ ఓడరేవుల నుంచి రాకపోకలు సాగించకుండా ఈ దిగ్బంధనం వర్తిస్తుందని, ఇప్పటికే 13 నౌకలను వెనక్కి పంపినట్లు అధికారులు వెల్లడించారు. దౌత్యపరమైన పరిష్కారాన్నే తాము కోరుకుంటున్నామని, కానీ చర్చలు విఫలమైతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెగ్సెత్ హెచ్చరించారు. "మేం మంచి మార్గాన్నే ఇష్టపడతాం... కానీ మీరు చెడు మార్గాన్ని ఎంచుకుంటే, మీ ఇంధన పరిశ్రమతో పాటు కీలకమైన మౌలిక సదుపాయాలే మా లక్ష్యం. మా అధ్యక్షుడి ఆదేశాలతో, ఒక్క బటన్ నొక్కితే చాలు.. మేము దాడికి సిద్ధం" అని ఆయన స్పష్టం చేశారు. కాల్పుల విరమణ అమల్లో ఉన్నప్పటికీ, తమ సైన్యం పూర్తి సంసిద్ధతతో ఉందని, క్షణాల్లో భారీ సైనిక చర్యలను పునఃప్రారంభించగలమని జనరల్ కెయిన్ అన్నారు. ఈ విరామ సమయాన్ని ఆయుధాలు సమకూర్చుకోవడానికి, వ్యూహాలను సర్దుబాటు చేసుకోవడానికి వినియోగించుకుంటున్నామని అడ్మిరల్ కూపర్ తెలిపారు. బహ్రెయిన్, సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్ వంటి ప్రాంతీయ భాగస్వాములు తమకు 'అసాధారణ సహచరులు'గా అండగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఇటీవలి ఆపరేషన్లలో ఇరాన్ కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, వారి కమ్యూనికేషన్ వ్యవస్థ మునుపెన్నడూ లేనంత బలహీనంగా మారిందని హెగ్సెత్ పేర్కొన్నారు. మరోవైపు, గల్ఫ్ దేశాల నుంచి ఇంధన సరఫరాలపై ఆధారపడిన భారత్, ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తోంది. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హార్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు పెరగడం ఆందోళన కలిగించే అంశం. ఈ సంక్లిష్టమైన జలాల్లో దిగ్బంధనాన్ని అమలు చేయడం "సూపర్‌మార్కెట్ పార్కింగ్ లాట్‌లో స్పోర్ట్స్ కార్ నడపడం లాంటిది" అని జనరల్ కెయిన్ వ్యాఖ్యానించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.



## 120 మందికి విమానం మిస్

**కొత్త నిబంధనతో తనిఖీలు ఆలస్యం**

లండన్: యూరోపియన్ యూనియన్ బోర్డింగ్‌కు సంబంధించి కొత్త నిబంధనలు ప్రవేశపెట్టిన కొద్దిరోజులకే ప్రయాణికులకు చేదు అనుభవం ఎదురైంది. కొత్త నిబంధనల కారణంగా బోర్డింగ్ సమయంలో 120 మందికి పైగా ప్రయాణికులకు విమానం మిస్ అయింది. యూరప్‌లో ఇటీవల బోర్డర్ కంట్రోల్ సిస్టమ్ అమల్లోకి వచ్చింది. ప్రయాణికులు పాస్‌పోర్టు స్టాంపింగ్‌కు బదులు బయోమెట్రిక్, ఫింగర్ ప్రింట్స్ స్కాన్ చేయాల్సి ఉంటుంది. ఈ కారణంగా వారికి చెకింగ్ ఆలస్యం కావడం వల్ల 120 మంది ప్రయాణికులు విమానాశ్రయంలో ఉన్నప్పటికీ విమానం ఎక్కలేకపోయారు. కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చిన అనంతరం, మిలాన్ నుంచి మాంచెస్టర్‌కు వెళ్లేందుకు 156 మంది ప్రయాణికులు టిక్కెట్ బుక్ చేసుకున్నారు. ప్రయాణానికి కొన్ని గంటల ముందు వారంతా విమానాశ్రయానికి చేరుకుని, తనిఖీల కోసం వరుస కట్టారు. తనిఖీలకు మూడు నాలుగు గంటల సమయం పట్టడంతో చాలామంది బోర్డింగ్ గేట్‌కు చేరుకోలేకపోయారు. కొత్త నిబంధనల కారణంగా 156 మందికి గాను 34 మంది పాస్‌పోర్టుల చెకింగ్ మాత్రమే పూర్తయింది. 120 మంది చెకింగ్ పూర్తి కాకపోవడంతో విమానం మిస్ అయింది. కొత్త పద్ధతిలో చెకింగ్ చేయడం వల్ల విమానం మిస్ కావడంతో పాటు గంటల కొద్దీ వరుసలో నిలబడటం వల్ల కొంతమంది అస్వస్థతకు గురయ్యారు. చెకింగ్ ఆలస్యం కారణంగా మిగిలిన ప్రయాణికుల కోసం విమానాన్ని కొంత సమయం నిలిపి ఉంచారు. కానీ ఆ తర్వాత భద్రతా కారణాల వల్ల బయలుదేరింది. సరిహద్దు భద్రత కారణంగా యూరోపియన్ దేశాలు కొత్తగా ఎంట్రీ/ఎగ్జిట్ సిస్టం (ఈఈఎస్)ను తీసుకువచ్చాయి. బయోమెట్రిక్ రిజిస్ట్రేషన్, డేటా బేస్ చెకింగ్ కారణంగా ప్రయాణికులు విమానాన్ని అందుకోలేకపోయారని విమానాశ్రయ అధికారులు తెలిపారు. రద్దీగా ఉండే సమయాల్లో ఈ ప్రక్రియకు ఎక్కువ సమయం తీసుకోవచ్చని అన్నారు.

## పాక్‌లో ఉగ్రవాదులకు ముచ్చెమటలు

### వరుస పెట్టి హత్యలు.. ఉగ్రవాద నెట్‌వర్క్‌లలో కలకలం



ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో భారత్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఉగ్రవాదుల ఏరివేత పరంపర కొనసాగుతోంది. గుర్తు తెలియని వ్యక్తులు జరుపుతున్న దాడుల్లో కీలక ఉగ్రవాదులు ఒకరి తర్వాత ఒకరు హతమవుతున్నారు. తాజాగా, లష్కర్-ఏ-తోయిబా సంస్థ సహ వ్యవస్థాపకుడు అమీర్ హమ్జాపై లాహోర్‌లో దాడి జరిగింది. మోటార్‌సైకిల్‌పై వచ్చిన అపరిచిత దుండగులు అతనిపై కాల్పులు జరిపారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన హమ్జా ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గత రెండు, మూడు సంవత్సరాలుగా పాక్‌లో కొనసాగుతున్న ఉగ్రవాదుల "కిల్ ట్రైల్"లో ఈ ఘటన తాజా ఉదాహరణగా నిలుస్తోంది. పాకిస్థాన్‌లోని కరాచీ నుంచి లాహోర్ వరకు కీలక ఉగ్రవాదులే లక్ష్యంగా ఈ దాడులు జరుగుతున్నాయి. దాడి చేసేవారు ఎక్కువగా మోటార్‌సైకిళ్లపై వచ్చి, పని పూర్తిచేసి కనుమరుగవుతున్నారు. ఈ పరంపరలో గత రెండేళ్లుగా అనేక మంది కీలక ఉగ్రవాదులు హతమయ్యారు. వీరిలో అత్యధికులు భారత్ 'మోస్ట్ వాంటెడ్' జాబితాలో ఉన్నవారే కావడం గమనార్హం. 2023లో కేవలం ఏడు నెలల వ్యవధిలోనే ఏడుగురు ఉగ్రవాదులు ఇలాంటి దాడుల్లో మరణించడం ఈ ధోరణికి అద్దం పడుతోంది. ఇలా హతమైన వారిలో జైష్-ఏ-మహమ్మద్, లష్కర్-ఏ-తోయిబా, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి సంస్థల అగ్ర నాయకులు ఉన్నారు. 1999లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం ఐసి-814 హైజాకర్లలో ఒకడైన మిస్త్రీ జహూర్ ఇబ్రాహీం, 2022 మార్చిలో కరాచీలో గుర్తు తెలియని వ్యక్తుల కాల్పుల్లో చనిపోయాడు. 2016 పఠాన్‌కోట్ ఉగ్రదాడి సూత్రధారి షాహిద్ లతీఫ్, 2023 అక్టోబర్‌లో సియాల్‌కోట్‌లో హతమయ్యాడు. అదేవిధంగా, ఖలిస్తాన్ కమాండో ఫోర్స్ చీఫ్ పరమ్జిత్ సింగ్ పంజ్వార్‌ను లాహోర్‌లో కాల్చి చంపారు. 26/11 ముంబై దాడుల సూత్రధారి హఫీజ్ సయీద్‌కు అత్యంత సన్నిహితుడైన అబు ఖతాల్, ముఫ్తీ ఖైసర్ ఫరూఖ్ వంటి వారు కూడా ఈ "కిల్ ట్రైల్"కు బలయ్యారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో లష్కర్ అగ్రశ్రేణి కమాండర్ ఖ్వాజా షాహిద్‌ను కిడ్నాప్ చేసి, నియంత్రణ రేఖ వద్ద తల నరికిన స్థితిలో పడేశారు. యువతను రెచ్చగొట్టి కాశ్మీర్‌లోకి పంపే లష్కర్ రిక్రూటర్ అక్రమ్ ఖాన్ ఘాజీని కూడా గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపారు. పాకిస్థాన్ పోలీసులు ప్రతి దాడి తర్వాత "మోటార్‌సైకిల్‌పై వచ్చిన అపరిచితులు" ఈ ఘాతుకానికి పాల్పడ్డారని చెప్పడం మినహా, నిందితులను పట్టుకున్న దాఖలాలు లేవు. ఈ వరుస హత్యల వెనుక ఎవరున్నారనే దానిపై స్పష్టత లేనప్పటికీ, ఉగ్రవాద కార్యకలాపాలకు కేంద్రంగా మారిన పాకిస్థాన్‌లో ఈ పరిణామాలు ఉగ్రవాద నెట్‌వర్క్‌లను తీవ్రంగా అస్థిరపరుస్తున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.



## నేడు సాయంత్రం 4 గంటలకు ఓటింగ్

**లోక్‌సభలో మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులు**

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మహిళా రిజర్వేషన్ బిల్లు సహా మూడు కీలక బిల్లులను కేంద్ర ప్రభుత్వం గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లులపై సుదీర్ఘంగా చర్చించిన తర్వాత, శుక్రవారం ఓటింగ్ నిర్వహించనున్నట్టు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సభకు తెలియజేశారు. లోక్‌సభ ముందుకు వచ్చిన ఈ బిల్లుల ప్రాధాన్యత దృష్ట్యా, వాటిపై విస్తృత స్థాయి చర్చ జరగాలని సభ్యులు కోరడంతో చర్చా సమయాన్ని పెంచుతున్నట్టు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు-2026 (మహిళా రిజర్వేషన్), డీలిమిటేషన్ బిల్లు-2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు-2026ను సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. ఈ బిల్లులపై 12 గంటల పాటు చర్చ జరపాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలిపారు. అయితే, దీనిపై స్పందించిన స్పీకర్ ఓం బిర్లా, చర్చను అవసరమైతే 15 నుంచి 18 గంటల వరకు పొడిగిస్తామని, సభ్యులందరికీ మాట్లాడేందుకు తగిన సమయం ఇస్తామని హామీ ఇచ్చారు. రేపు సాయంత్రం 4 గంటలకు ఓటింగ్ నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు. అంతకుముందు మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టే దశలోనే సభలో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. ప్రతిపక్షాలు మూజువాణి ఓటింగ్‌ను వ్యతిరేకించి, డివిజన్ (రికార్డెడ్ ఓటింగ్) పద్ధతిలో ఓటింగ్ జరపాలని పట్టుబట్టాయి. సాధారణంగా సభలో మూజువాణి ఓటుతో తీర్మానాలు ఆమోదిస్తుంటారు. కానీ, ఫలితంపై వివాదం తలెత్తినప్పుడు డివిజన్ ఓటింగ్ నిర్వహిస్తారు. ప్రతిపక్షాల డిమాండ్ మేరకు స్పీకర్ డివిజన్ ఓటింగ్‌కు ఆదేశించారు. ఓటు స్లిప్పుల ద్వారా జరిగిన ఈ ఓటింగ్‌లో బిల్లు ప్రవేశపెట్టడానికి అనుకూలంగా 251 ఓట్లు, వ్యతిరేకంగా 185 ఓట్లు పోలైనట్టు స్పీకర్ ప్రకటించారు.

## నాకు రక్షణ కల్పించండి

**నేను మైనర్ కాదు.. మేజర్‌ను.. కేరళ సీఎంకు మోనాలిసా లేఖ**



కొచ్చి: 'కుంభమేళా వైరల్ స్టార్'గా పేరుపొందిన మోనాలిసా భోస్లే వివాదంలో గురువారం అనూహ్య మలుపు చోటుచేసుకుంది. మధ్యప్రదేశ్ పోలీసులు తనను బలవంతంగా సొంతూరికి తీసుకెళ్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ, తనకు రక్షణ కల్పించాలని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు, కొచ్చి నగర పోలీస్ కమిషనర్ పుట్ట విమలాదిత్యకు ఆమె లేఖ రాసింది. తాను 18 ఏళ్లు నిండిన మేజర్‌నని ఆమె ఆ లేఖలో స్పష్టం చేసింది. మోనాలిసా, ఆమె భర్త ఫర్మాన్ ఖాన్‌పై నమోదైన పోక్సో చట్టం కేసుకు సంబంధించి వారి వాంగ్మూలాలను నమోదు చేసేందుకు మధ్యప్రదేశ్ పోలీసు బృందం కొచ్చికి చేరుకున్న సమయంలో ఈ పరిణామం జరిగింది. తిరువనంతపురం సమీపంలోని ఓ ఆలయంలో మార్చి 11న వీరి వివాహం జరిగినప్పుడు మోనాలిసా మైనర్ అని జాతీయ గిరిజన కమిషన్ విచారణలో తేలడంతో ఈ కేసు నమోదైంది. అయితే, కేరళ హైకోర్టు నుంచి ఫర్మాన్ ఖాన్ మే 20 వరకు అరెస్ట్ కాకుండా స్టే పొందగలిగాడు. ఈ వివాదం కేరళలో రాజకీయ దుమారం రేపింది. అధికార సీపీఎం నేతల అండతోనే మైనర్ బాలిక వివాహం జరిగిందని రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి ఎస్. సురేశ్ ఆరోపించారు. దీనికి బాధ్యులైన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే, ఈ ఆరోపణలను సీపీఎం ఖండించింది. తాము పెళ్లి నిర్వహించలేదని, విషయం తెలిసిన తర్వాత కేవలం హాజరయ్యామని స్పష్టం చేసింది. మరోవైపు, మోనాలిసా తల్లి లతా భోస్లే తన కుమార్తె 2009 డిసెంబర్‌లో జన్మించిందని, ఆమె మైనర్ అని వాదిస్తోంది. సినిమా అవకాశాల ఆశ చూపి తన కుమార్తెను ప్రలోభపెట్టి తీసుకెళ్లారని ఆరోపించింది. పెళ్లి కోసం నకిలీ జనన ధృవీకరణ పత్రం సృష్టించారని, కమిషన్ ప్రాథమిక దర్యాప్తులోనూ ఇదే విషయం వెల్లడైందని తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని ఆసుపత్రి రికార్డుల ప్రకారం కూడా వివాహ సమయంలో మోనాలిసా వయసు 16 ఏళ్లేనని తేలడం కేసును మరింత సంక్లిష్టంగా మార్చింది. ప్రస్తుతం ఈ కేసుపై విచారణను తీవ్రతరం చేసిన గిరిజన కమిషన్, కేరళ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల సీనియర్ పోలీస్ అధికారులను ఢిల్లీకి విచారణకు హాజరు కావాలని ఆదేశించింది.

## ఢీకొన్న రెండు విమానాలు

**ఆకాశ ఎయిర్ విమానాన్ని ఢీకొట్టిన స్పైస్‌జెట్**

**ఢిల్లీ ఎయిర్ పోర్టులో ఘటన**

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో గురువారం సాయంత్రం పెను ప్రమాదం తృటిలో తప్పింది. ట్యాక్సీ వేపై ఆకాశ ఎయిర్, స్పైస్‌జెట్‌కు చెందిన రెండు విమానాలు ఒకదానికొకటి స్వల్పంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా బయటపడటంతో అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. విమానాశ్రయ వర్గాల సమాచారం ప్రకారం, స్పైస్‌జెట్‌కు చెందిన బోయింగ్ బీ737-700 విమానం ట్యాక్సీయింగ్ చేస్తుండగా ఈ ఘటన జరిగింది. ఆ సమయంలో హైదరాబాద్‌కు బయలుదేరేందుకు సిద్ధంగా ఉన్న ఆకాశ ఎయిర్ విమానం క్యూపీ 1406 నిలిపి ఉంది. వేగంగా వస్తున్న స్పైస్‌జెట్ విమానం కుడి రెక్క (రైట్ వింగ్), నిలిపి ఉన్న ఆకాశ విమానం తోక భాగంలోని స్టెబిలైజర్‌ను తాకింది. దీంతో రెండు విమానాల భాగాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఈ ఘటనపై ఆకాశ ఎయిర్ వెంటనే స్పందించింది. తమ విమానం ఆగి ఉన్నప్పుడు మరో విమానం వచ్చి ఢీకొట్టినట్లు ప్రాథమికంగా తెలిసిందని సంస్థ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. "ప్రయాణికులు, సిబ్బంది అందరినీ సురక్షితంగా విమానం నుంచి దించాం. హైదరాబాద్ వెళ్లాల్సిన ప్రయాణికుల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం" అని ఆయన వివరించారు. ఈ ఘటన కారణంగా దిల్లీ విమానాశ్రయంలో విమాన రాకపోకలకు పెద్దగా అంతరాయం కలగలేదు. అయితే, దెబ్బతిన్న రెండు విమానాలను అధికారులు పరిశీలన కోసం బేకు తరలించారు. ఈ ఘటనపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) విచారణ జరిపే అవకాశం ఉంది.

## లెన్స్ కార్ట్ సిబ్బంది బొట్టు పెట్టుకోవద్దా?

**సోషల్ మీడియాలో ప్రచారం.. సీఈవో క్షమాపణలు**

న్యూఢిల్లీ: ఆఫీస్ డ్రెస్ కోడ్‌లో భాగంగా సిబ్బంది మతపరమైన గుర్తులు ధరించవద్దని లెన్స్‌కార్ట్ సర్క్యులర్ జారీ చేసినట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడంతో, సీఈవో పీయూష్ బన్సల్ స్పందించారు. లెన్స్‌కార్ట్ సిబ్బందికి గైడ్ లైన్స్ పేరిట నెట్టింట కొన్ని పాయింట్లు వైరల్ అయ్యాయి. వీటి ప్రకారం, స్టోర్లలో సిబ్బంది నలుపు రంగు హెడ్ స్కార్ఫ్ (హిజాబ్), నలుపు తలపాగాలు ధరించడానికి అనుమతి ఉంది. తిలకం, బిందీ పెట్టుకోవడానికి మాత్రం అనుమతి లేదు. వీటిపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తాయి. మతపరమైన పక్షపాతం చూపిస్తున్నారంటూ నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై పీయూష్ బన్సల్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. లెన్స్‌కార్ట్ విషయంలో అసత్య ప్రచారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బిందీ, తిలకం సహా ఎలాంటి మతపరమైన వ్యక్తీకరణలపైనా తమ సంస్థలో ఆంక్షలు లేవని తెలిపారు. తాము ఎప్పటికప్పుడు తమ సంస్థ మార్గదర్శకాలను సమీక్షిస్తూనే ఉంటామని పేర్కొన్నారు. అది పాత సర్క్యులర్ అని, ఆ విధానాలు ప్రస్తుత పరిస్థితులను ప్రతిబింబించవని స్పష్టం చేశారు. అది కాలం చెల్లిన ట్రైనింగ్ నోట్ అని, అది తమ హెచ్ఆర్ పాలసీని ప్రతిబింబించబోదని తెలిపారు. ఈ గందరగోళం పట్ల క్షమాపణలు కోరుతున్నట్లు పీయూష్ బన్సల్ పేర్కొన్నారు.

## కనీస వేతనం రూ.69,000!

**8వ పే కమిషన్ ముందు కీలక ప్రతిపాదన**

న్యూఢిల్లీ: 8వ వేతన సంఘం ఏర్పాటు నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కనీస వేతనాన్ని భారీగా పెంచాలనే కీలక ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఉద్యోగ సంఘాల తరఫున ప్రభుత్వంతో చర్చలు జరిపే అత్యున్నత సంస్థ అయిన నేషనల్ కౌన్సిల్-జాయింట్ కన్సల్టేటివ్ మెషినరీ, 8వ పే కమిషన్‌కు సమర్పించిన మెమోరాండంలో ఈ డిమాండ్‌ను ఉంచింది. ప్రస్తుతం 7వ వేతన సంఘం సిఫార్సుల ప్రకారం ఉన్న రూ.18,000 కనీస వేతనాన్ని ఏకంగా రూ.69,000కు పెంచాలని ఎన్‌సీ-జెసీఎమ్ డిమాండ్ చేసింది. ఇందుకోసం ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను 3.833గా నిర్ణయించాలని సూచించింది. 7వ వేతన సంఘంలో ఈ ఫ్యాక్టర్ 2.57గా ఉండగా, అప్పటి కనీస వేతనం రూ.7,000 నుంచి రూ.18,000కు పెరిగింది. ఇప్పుడు ఉద్యోగ సంఘాలు అంతకంటే చాలా ఎక్కువ ఫిట్‌మెంట్‌ను ప్రతిపాదిస్తున్నాయి. కనీస వేతనంతో పాటు వార్షిక ఇంక్రిమెంట్ 6 శాతంగా ఉండాలని, ప్రమోషన్‌పై రెండు ఇంక్రిమెంట్లు (కనీసం రూ.10,000 లబ్ధి) ఇవ్వాలని, ఒక నెల వేతనాన్ని గ్రాట్యుటీగా అందించాలని కూడా ఎన్‌సీ-జెసీఎమ్ కోరింది. ఈ మార్పులు అమలైతే, దేశవ్యాప్తంగా సుమారు 50 లక్షల మంది ఉద్యోగులు, 65 లక్షల మంది పెన్షనర్లకు లబ్ధి చేకూరుతుంది. ఇదిలా ఉండగా, 58 శాతం కరువు భత్యాన్ని బేసిక్ పేలో కలపాలని ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ పోస్టల్ ఆర్గనైజేషన్స్ ప్రభుత్వాన్ని కోరుతోంది.

## లవ్లీ చిత్రం



డింపుల్ హయాతి





## గ్యాంగ్‌స్టర్ లుక్‌లో యశ్?

'కేజీఎఫ్' సినిమాతో పాన్ ఇండియా రేంజ్‌లో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన యశ్, తన తదుపరి చిత్రం 'టాక్సిక్' గురించి అదిరిపోయే అప్‌డేట్స్ ఇచ్చారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా సీక్వెల్స్, ఫ్రాంచైజీల హడావిడి నడుస్తుంటే.. తాను మాత్రం ఒక ఒరిజినల్ అండ్ రా గ్యాంగ్‌స్టర్ డ్రామాతో వస్తున్నానని ఆయన స్పష్టం చేశారు. ఈ సినిమా హాలీవుడ్ స్థాయి మేకింగ్‌తో, మునుపెన్నడూ చూడని విధంగా ఉంటుందని యశ్ చెబుతుండటంతో అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. 'టాక్సిక్' ఒక ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్ మూవీ అని, ఇది ఏ సినిమాకు కొనసాగింపు కాదని ఆయన తేల్చి చెప్పారు. వ్యాపార కోణంలో కాకుండా, ఒక గొప్ప కథను ప్రేక్షకులకు అందించాలనే ఉద్దేశంతోనే ఈ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించినట్లు యశ్ వెల్లడించారు. ఇక, కేజీఎఫ్ తెచ్చిన భారీ విజయంపై యశ్ చాలా పరిణతితో స్పందించారు. "ప్రేక్షకులు నాకు విజయాన్ని ఇచ్చింది కేవలం పండగ చేసుకోవడానికి కాదు, ప్రతిసారీ అంతకంటే మెరుగ్గా, ఇంకా పెద్దగా ఏదో ఒకటి చేయమని బాధ్యత ఇచ్చారు" అని ఆయన చెప్పుకొచ్చారు. ఇక అందుకే రొటీన్ కమర్షియల్ సినిమాల జోలికి వెళ్లకుండా, తన బాధ్యతను గుర్తుంచుకుని 'టాక్సిక్' కోసం ఎంతో శ్రమిస్తున్నట్లు తెలిపారు.

## సినిమాలు వదిలేద్దామనుకున్నా

బాలీవుడ్ నటి డైసీ షా తన సినీ ప్రయాణంలో ఎదురైన ఓ చేదు అనుభవం గురించి పంచుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. సల్మాన్ ఖాన్ నటించిన –జై హో– సినిమాతో హిందీ ప్రేక్షకులకు పరిచయం కావడానికి ముందే ఆమె దక్షిణాది సినిమాల్లో నటించింది. అయితే ఒకానొక సందర్భంలో ఓ చిత్ర దర్శకుడు తన పట్ల అనుచితంగా ప్రవర్తించాడని, ఆ ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని ఓ మీట్ లో ఆవేదన చెందింది. షూటింగ్ సమయంలో ఒక సన్నివేశాన్ని వివరిస్తున్న నెపంతో సదరు దర్శకుడు తనను అసభ్యకరమైన రీతిలో తాకారని డైసీ షా వెల్లడించింది. ఆ ఘటన అనుకోకుండా జరిగింది కాదని, కావాలనే తన గౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించారంది. ఈ చేదు అనుభవం వల్ల సినిమాలపై ఉన్న ఆసక్తి తగ్గిపోయిందని, సెట్స్‌లో ఉండటమే నరకంలా అనిపించిందని గుర్తు చేసుకుంది. ఆ దర్శకుడి ప్రవర్తన డైసీ షా ఎంతగా కుంగిపోయిందంటే.. అసలు నటనకే స్వస్తి చెప్పాలని అనుకున్నానంది. 'మనం ఎంతో గౌరవించే రంగంలో ఇలాంటి మనుషులు ఉంటారని ఊహించలేదు. ఆ ఒక్క ఘటన నా మనసును ఎంతగానో గాయ పరిచింది. నేను మళ్ళీ మేకప్ వేసుకోవడానికి చాలా కాలం పట్టిందని తెలిపింది.




## మరో పది రోజుల్లో లెనిన్ షూట్ కంప్లీట్

అఖిల్ అక్కినేని ప్రస్తుతం 'లెనిన్' చిత్రంలో హీరోగా నటిస్తున్నాడు. భాగ్యశ్రీ బోర్సే ఇందులో హీరోయిన్‌గా కనిపించనుండగా, మురళీ కిషోర్ అబ్బూరు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. జూన్ 26న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ చాలా రోజుల క్రితమే ప్రకటించారు. ఇక తాజాగా ఈ మూవీ షూటింగ్‌కు సంబంధించిన ఒక అప్డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, ఈ చిత్రానికి సంబంధించిన మరో పది రోజుల షూటింగ్ మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. అందులో మూడు రోజులు టాకీ పార్ట్ కోసం, మిగతా రోజుల్లో రెండు పాటలను చిత్రీకరించబోతున్నట్లు సమాచారం. ఇక ప్రస్తుతం డబ్బింగ్ పనులు కూడా జరుగుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత ప్రణాళికలను బట్టి చూస్తే, ఈ మూవీకి సంబంధించిన షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు మే నెలలో పూర్తయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. దాంతో ఈ మూవీ బృందం ఈ చిత్రాన్ని చెప్పిన సమయానికి కచ్చితంగా ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



## పెద్ద స్టార్స్ అయినా నో: మృణాల్



గ్లామర్ కంటే పర్ఫార్మెన్స్‌కే నా ఓటు అంటున్న మృణాల్ ఠాకూర్, తాజాగా చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ అవుతున్నాయి. తన కెరీర్ గ్రాఫ్‌ను మార్చేసిన సీత, యష్ణ వంటి పాత్రల తర్వాత.. ఆ స్థాయి లేని సినిమాలకు గుడ్ బై చెబుతున్నానని ఆమె గట్టిగా చెప్పారు. తాజాగా 'డెకాయిట్' మూవీతో ఆమె ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్ అందరినీ ఆశ్చర్యపరిచింది. మృణాల్ ఠాకూర్ తన కెరీర్‌లో 'సీతా మహాలక్ష్మి' (సీతారామం), 'యష్ణ' (హాయ్ నాన్న) వంటి పాత్రలను ఒక బెంచ్‌మార్క్‌గా భావిస్తున్నారు. ఆ స్థాయి నటనకు అవకాశం ఉన్న పాత్రలు దొరకడమే కష్టంగా మారిందని, అందుకే భారీ రెమ్యూనరేషన్ లేదా పెద్ద స్టార్స్ ఉన్నా సరే, తన పాత్రకు ప్రాధాన్యత లేకపోతే నిర్మొహమాటంగా 'నో' చెబుతున్నట్లు ఆమె వెల్లడించారు. కథలో లోతు లేని సాధారణ కమర్షియల్ రోల్స్ చేయడం కంటే, కాస్త ఆలస్యమైనా మంచి స్క్రిప్ట్ కోసమే ఎదురుచూస్తానని మృణాల్ స్పష్టం చేయడం విశేషం.

## కాస్మెటిక్స్ కాదు బాబోయ్



ప్రముఖ నటి అవ్ నీత్ కౌర్ గత కొంతకాలంగా సోషల్ మీడియాలో తనపై వస్తున్న ప్లాస్టిక్ సర్జరీ – బొటాక్స్ పుకార్లపై ఎట్టకేలకు మౌనం వీడారు. తన ముఖ కవళికల్లో మార్పులు వచ్చాయంటూ నెటిజన్లు చేస్తున్న కామెంట్లను ఆమె తీవ్రంగా ఖండించారు. తన ముఖ సౌందర్యం , ఫీచర్స్ అన్నీ తన తల్లి నుండి వచ్చిన సహజమైన పోలికలని.. అనవసరమైన కాస్మెటిక్ చికిత్సల జోలికి వెళ్లలేదని స్పష్టం చేశారు. సెలబ్రిటీల బాహ్య రూపంపై తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదని ఈ సందర్భంగా అవ్‌నీత్ ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నప్పటి నుండే కెమెరా ముందు పెరుగుతున్న తనను చూస్తున్న ప్రేక్షకులకు.. వయసుతో పాటు వచ్చే సహజమైన మార్పుల గురించి అవగాహన ఉండాలని అవ్‌నీత్ పేర్కొన్నారు. కౌమార దశ నుండి యవ్వనంలోకి అడుగుపెట్టే క్రమంలో ముఖంలో వచ్చే మార్పులను సర్జరీగా పొరబడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు.





## ధనుష్ కోసం సారా-ఖుషీ!

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఆయన కెరీర్ లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 56వ చిత్రం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమాలో ధనుష్ సరసన నటించే కథానాయిక ఎంపిక విషయంలో చిత్ర బృందం కసరత్తులు మొదలు పెట్టింది. ఈ ప్రాజెక్టు ప్రారంభంలో కన్నడ భామ రుక్మిణీ వసంత్‌ను కథానాయికగా ఎంపిక చేయాలని చిత్ర యూనిట్ భావించింది. దాదాపు ఆమె ఎంట్రీ కూడా ఖరారైంది. అయితే అమ్మడి బిజీ షెడ్యూల్ కారణంగా ప్రాజెక్ట్ వదులుకుంటుంది. ఇప్పుడు ఆ స్థానం కోసం బాలీవుడ్ బ్యూటీ సారా అర్జున్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆమెకు పోటీగా శ్రీదేవి చిన్న కుమార్తె ఖుషీ కపూర్ కూడా ఈ రేసులో వినిపిస్తోంది. ది ఆర్చీస్ సినిమాతో వెండితెరకు పరిచయమైన ఖుషీ తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు కోసం ప్రయత్నిస్తోంది. శ్రీదేవి వారసురాలిగా సౌత్ ఇండస్ట్రీలోకి గ్రాండ్ ఎంట్రీ ఇవ్వడానికి ధనుష్ సినిమా కంటే మెరుగైన ఆప్షన్ మరొకటి ఉండదని అమ్మడు భావిస్తోంది.





# ముంబై చిత్తు

## కొంపముంచిన సూర్య.. పంజాబ్ జైత్రయాత్ర.. శ్రేయస్ సూపర్ క్యాచ్

**ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ పరాజయాల పరంపర కొనసాగుతుండగా.. మరోవైపు పంజాబ్ కింగ్స్ తమ జైత్రయాత్రను కొనసాగిస్తోంది. గురువారం వాంఖడే స్టేడియం వేదికగా ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన పంజాబ్ కింగ్స్ 7 వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్‌ను చిత్తు చేసింది.**


మరోసారి పేలవ బ్యాటింగ్, చెత్త ఫీల్డింగ్, పసలేని బౌలింగ్‌తో ముంబై ఇండియన్స్ మూల్యం చెల్లించుకుంది. క్వింటన్ డికాక్ సెంచరీతో రాణించినా ఫలితం లేకపోయింది. పవర్ ప్లేలో స్లోగా ఆడటం.. స్లాగ్ ఓవర్లలో వేగంగా పరుగులు చేయకపోవడం ముంబై పతనాన్ని శాసించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 195 పరుగులు చేసింది.

క్వింటన్ డికాక్(60 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్స్‌లతో 112 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగగా.. నమన్ ధీర్(31 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 50) హాఫ్ సెంచరీతో రాణించాడు. పంజాబ్ బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్(3/22) మూడు వికెట్లు తీయగా.. మార్కో జాన్సెన్, శశాంక్ సింగ్ తలో వికెట్ తీసారు. అనంతరం పంజాబ్ కింగ్స్ 16.3 ఓవర్లలో 3 వికెట్లుకు 198 పరుగులు చేసి గెలుపొందింది. ప్రభ్‌సిమ్రాన్ సింగ్(39 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్స్‌లతో 80 నాటౌట్), శ్రేయస్ అయ్యర్(35 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లతో 66) హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. ముంబై బౌలర్లలో అల్లా గజన్‌ఫర్(2/31) రెండు వికెట్లు తీయగా.. శార్దూల్ ఠాకూర్(1/38) ఒక్క వికెట్ తీసాడు. ఈ మ్యాచ్‌లోనూ జస్‌ప్రీత్ బుమ్రా(0/41) ఒక్క వికెట్ తీయలేకపోయాడు. ఈ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. రోహిత్ గైర్హాజరీలో క్వింటన్ డికాక్ ఓపెనర్‌గా బరిలోకి దిగగా.. ఫామ్‌లో ఉన్న ర్యాన్ రికెల్టన్(2) తీవ్రంగా నిరాశపర్చాడు. అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. ఆ మరుసటి బంతికే సూర్యకుమార్ యాదవ్(0) కూడా క్యాచ్ ఇచ్చి డకౌట్‌గా వెనుదిరిగాడు. వరుసగా రెండు వికెట్లు కోల్పోవడంతో ముంబై బ్యాటర్లపై ఒత్తిడి పెరిగింది. దాంతో పవర్ ప్లేలో 2 వికెట్లకు 48 పరుగులే చేసింది. డికాక్, నమన్ ధీర్ అద్భుత బ్యాటింగ్‌తో నాలుగో వికెట్‌కు 122 పరుగులు జోడించినా.. స్లాగ్ ఓవర్లలో ముంబై దూకుడుగా ఆడలేకపోయింది. డికాక్‌తో పాటు హార్దిక్ పాండ్యా(14), రూథర్‌ఫోర్డ్(1), తిలక్ వర్మ(8) తీవ్రంగా నిరాశపర్చారు. దాంతో ముంబై 195 పరుగులకే పరిమితమైంది. పవర్ ప్లేలో, స్లాగ్ ఓవర్లలో కాస్త దూకుడుగా ఆడి 30-40 పరుగులు అదనంగా చేసి ఉంటే మ్యాచ్ ఫలితం మరోలా ఉండేది. చేసిందే స్వల్ప లక్ష్యం అంటే.. చెత్త ఫీల్డింగ్‌తో ముంబై ఇండియన్స్ మూల్యం చెల్లించుకుంది. 11 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ప్రభ్‌సిమ్రాన్ సింగ్ ఇచ్చిన సునాయస క్యాచ్‌ను బ్యాక్‌వర్డ్ పాయింట్‌లో జస్‌ప్రీత్ బుమ్రా నేలపాలు చేశాడు. ఈ అవకాశంతో అతను మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శనతో చెలరేగాడు. శ్రేయస్ అయ్యర్ ఇచ్చిన కష్టతరమైన క్యాచ్‌ను నమన్ ధీర్ నేలపాలు చేశాడు. ప్రభ్‌సిమ్రాన్ క్యాచ్ పట్టి ఉంటే మ్యాచ్ కొంత ఉత్కంఠగా మారేది.




## అర్ష్‌దీప్.. 100

పంజాబ్ కింగ్స్ కెప్టెన్ అర్ష్‌దీప్ సింగ్ చరిత్ర సృష్టించాడు. 19 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలోనే పంజాబ్ కింగ్స్ తరఫున 100 వికెట్ల మైలురాయి అందుకున్నతొలి బౌలర్‌గా నిలిచాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ముంబై ఇండియన్స్‌తో గురువారం జరిగిన మ్యాచ్‌లో అర్ష్‌దీప్ సింగ్ ఈ ఫీట్ సాధించాడు. ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లోనే ముంబై ఇండియన్స్ ఓపెనర్ ర్యాన్ రికెల్టన్(2)ను క్యాచ్ ఔట్ చేయడం ద్వారా అర్ష్‌దీప్ సింగ్.. ఐపీఎల్‌లో 100 వికెట్ల క్లబ్‌లో చేరాడు. పంజాబ్ కింగ్స్ తరఫున ఏ బౌలర్ కూడా ఈ ఫీట్ సాధించలేదు. ఆ మరుసటి బంతికే సూర్యకుమార్ యాదవ్‌ను డకౌట్‌గా అర్ష్‌దీప్ సింగ్ పెవిలియన్ చేర్చాడు. పంజాబ్ కింగ్స్ తరఫున అర్ష్‌దీప్ సింగ్ తర్వాత మరే బౌలర్ కూడా 90 వికెట్లు తీయలేదు. పంజాబ్ కింగ్స్ తరఫున 87 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో అర్ష్‌దీప్ సింగ్(101 వికెట్లు) ఈ ఫీట్ సాధించాడు. అతని తర్వాత పియూష్ చావ్లా(84), సందీప్ శర్మ(73), అక్షర్ పటేల్ (61), మహమ్మద్ షమీ(58) వికెట్లు పడగొట్టారు. 2008-13 మధ్య పంజాబ్ కింగ్స్ తరఫున 87 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడిన పియూష్ చావ్లా 84 వికెట్లు తీసాడు. 2012-2021 వరకు పంజాబ్ కింగ్స్‌కు సందీప్ శర్మ 61 మ్యాచ్‌ల్లో 73 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్‌లో ఒక జట్టు తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా సునీల్ నరైన్ కొనసాగుతున్నాడు.




## హైదరాబాద్ చేరిన ధోనీ

### సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌కి కూడా దూరమే

ధోనీ ఫ్యాన్స్‌కి మళ్లీ బ్యాడ్ న్యూసే. ఎప్పుడెప్పుడు ధోనీని గ్రౌండ్‌లో చూద్దామనుకుంటున్న ఫ్యాన్స్‌కి మళ్లీ మళ్లీ నిరాశే ఎదురవుతోంది. ఏప్రిల్ 18న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగే మ్యాచ్‌కి ధోనీ కచ్చితంగా అందుబాటులోకి వస్తాడని అందరూ అనుకున్నారు. నెట్స్‌లో కూడా ప్రాక్టీస్ చేయడం, ఫుల్ ఫిట్‌నెస్‌తో ఉండటంతో ఉప్పల్ స్టేడియం విజిల్స్ మోతతో మార్మోగిపోతుందని అందరూ అనుకున్నారు. కానీ తాజా అప్డేట్ తీవ్ర నిరాశకు గురి చేసింది. "ధోనీ నెట్స్‌లో నెమ్మదిగా ప్రాక్టీస్ చేస్తున్నట్లు కనిపించాడు. కానీ సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌లో మాత్రం ఆడే అవకాశాలు కనిపించడం లేదు. సీఎస్కే స్క్వాడ్ హైదరాబాద్ చేరుకుంది. అయితే ధోనీ తన ప్లాన్ గురించి ఇంకా ఏ సమాచారం ఇవ్వలేదు" అంటూ క్రిక్‌బజ్ ఎక్స్ వేదికగా పోస్ట్ చేసింది. కండరాల సమస్యతో సీజన్ ప్రారంభానికి ముందే జట్టుకు దూరమైన ధోనీ, ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో ఫిట్‌నెస్ సాధించలేదు. మొదట రెండు వారాల పాటు విశ్రాంతి తీసుకుని, ఆ తర్వాత మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటాడని సీఎస్కే మేనేజ్‌మెంట్ వెల్లడించింది. కానీ, రెండు వారాల తర్వాత కూడా పూర్తిగా కోలుకోకపోవడంతో.. ఎప్పుడు రికవరీ అవుతాడో తెలియదని, ఫుల్ ఫిట్‌నెస్ సాధించాకే జట్టులో జాయిన్ అవుడానే స్టేట్‌మెంట్ వచ్చింది. సీఎస్కే ఇటీవలే బ్యాక్ టు బ్యాక్ విక్టరీలతో ఐపీఎల్ 2026లో కమ్ బ్యాక్ ఇచ్చింది. ఈ సమయంలో ధోనీ కూడా జట్టులో ఉంటే ప్లానింగ్స్‌తో ప్లే ఆఫ్స్‌కి తీసుకెళ్తాడని అందరూ అనుకున్నారు. కానీ, పూర్తి స్థాయిలో ఫిట్‌నెస్ సాధించకపోవడంతో బయటే ఉండాల్సి వచ్చింది. ధోనీ ఆడకపోయినా.. ప్రతీ మ్యాచ్‌కి ముందు జట్టుతో కనిపించి అభిమానులను అలరిస్తున్నాడు. టీమ్ ప్రాక్టీస్ సమయంలో అక్కడే ఉంటూ సలహాలు, సూచనలు అందిస్తున్నాడు. కేకేఆర్ మ్యాచ్‌కి ముందు ధోనీ ఇచ్చిన సలహాలతో నూర్ అహ్మద్ కీలక వికెట్లు తీసుకున్నాడు. ధోనీ ఆడకపోయినా.. విజయాల్లో జట్టుకు సహకారాలు అందిస్తున్నాడు. సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌కి ధోనీ వస్తాడని ముందుగా వార్తలు రావడంతో ఉప్పల్‌లో టికెట్ల కోసం అభిమానులు పోటెత్తారు. ఇప్పటి వరకు ధోనీ రాకపై ఎలాంటి సమాచారం లేదు. ధోనీ వచ్చేది, రానిది ఈ రోజు తర్వాత ఫుల్ క్లారిటీ వస్తుంది.

### టోర్నీ నుంచి ఖలీల్ అహ్మద్ అవుట్

చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు బిగ్ షాక్ తగిలింది. ఆ జట్టు స్టార్ పేసర్ ఖలీల్ అహ్మద్ గాయం కారణంగా ఐపీఎల్ 2026 సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. ఏప్రిల్ 14న కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో ఖలీల్ అహ్మద్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సీజన్లో చెన్నైకి ఆరంభంలోనే వికెట్లు తీసిపెడుతున్న ఖలీల్ దూరం కావడం ఆ జట్టు ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. కోల్‌కతా ఇన్నింగ్స్ 17వ ఓవర్ వేస్తున్న సమయంలో ఖలీల్ అహ్మద్ గాయపడ్డాడు. ఓవర్ చివరి బంతి వేయడానికి రన్-అప్ తీసుకుంటున్న సమయంలో ఖలీల్ కుడి తొడ భాగంలో తీవ్రమైన నొప్పి రావడంతో మధ్యలోనే ఆగిపోయాడు. నొప్పితో విలవిలలాడిన ఖలీల్ అహ్మద్.. మెడికల్ టీమ్ సహాయంతో మైదానాన్ని వీడాడు. ఆ ఓవర్లో మిగిలిన ఒక్క బంతిని గుర్జప్నీత్ సింగ్ పూర్తి చేయాల్సి వచ్చింది. ఆ మ్యాచ్‌లో గాయపడకముందు ఖలీల్ అహ్మద్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. మూడు ఓవర్లలో కేవలం 17 పరుగులు మాత్రమే ఇచ్చి ప్రమాదకరమైన సునీల్ నరైన్ వికెట్ పడగొట్టాడు. వైద్య పరీక్షల అనంతరం ఖలీల్‌కు 'గ్రేడ్ 2 టియర్' అయినట్లు నిర్ధారణ అయింది. ఖలీల్ అహ్మద్ కుడి కాలు కండరం తీవ్రంగా దెబ్బతిన్నట్లు వైద్యులు వెల్లడించారు. ఈ గాయం నుండి కోలుకోవడానికి కనీసం 10 నుండి 12 వారాల సమయం పడుతుందని.. ఈ నేపథ్యంలో ఖలీల్ అహ్మద్ ఐపీఎల్ మిగిలిన మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడని వైద్య బృందం స్పష్టం చేసింది. చాలా కాలం విశ్రాంతి అవసరమని ఖలీల్‌కు సూచించారు. ఈ సీజన్‌లో చెన్నై ఆడిన ఐదు మ్యాచ్‌లలోనూ ఖలీల్ అహ్మద్ తుది జట్టులో ఉన్నాడు. పవర్ ప్లేలో పొదుపుగా బౌలింగ్ చేస్తూ వికెట్లు తీస్తున్న ఖలీల్ స్థానాన్ని భర్తీ చేయడం ఇప్పుడు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు సవాలుగా మారింది. టోర్నమెంట్ కీలక దశకు చేరుకుంటున్న తరుణంలో ఖలీల్ వంటి కీలక ఆటగాడు దూరం కావడం సీఎస్కే అభిమానులను ఆందోళనకు గురిచేస్తోంది. త్వరలోనే ఖలీల్ అహ్మద్ స్థానంలో రిప్లేస్‌మెంట్ ప్లేయర్‌ను జట్టు ప్రకటించే అవకాశం ఉంది.



## కమిన్స్ వచ్చేస్తున్నాడు!

సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సమయం వచ్చేసింది. ఎస్ఆర్‌హెచ్ రెగ్యులర్ కెప్టెన్, ఆస్ట్రేలియా వరల్డ్ కప్ విన్నింగ్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఎట్టకేలకు మైదానంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యాడు. గత కొంతకాలంగా వీపు గాయంతో సతమతమవుతున్న కమిన్స్.. తాజాగా నిర్వహించిన ఫిట్‌నెస్ టెస్టులో ఉత్తీర్ణుడయ్యాడు. దీంతో ఐపీఎల్ 2026 సీజన్ మధ్యలో సన్‌రైజర్స్ శిబిరంలో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ సీజన్ ప్రారంభానికి ముందే కమిన్స్ భారత్ చేరుకున్నా.. గాయం తీవ్రత దృష్ట్యా ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడలేకపోయాడు. కమిన్స్ రాకతో కెప్టెన్సీ బాధ్యతల నుంచి ఇషాన్ కిషన్ తప్పుకోనున్నాడు. ఏప్రిల్ 2న కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన ఉత్కంఠ పోరు తర్వాత, కమిన్స్ తన వీపు గాయానికి సంబంధించి తదుపరి వైద్య పరీక్షల కోసం హుటాహుటిన ఆస్ట్రేలియాకు పయనమయ్యాడు. సిడ్నీలో జరిగిన తాజా 'బ్యాక్ స్కాన్' నివేదికల్లో కమిన్స్ గాయం పూర్తిగా నయమైందని వైద్యులు ధ్రువీకరించారు. ఈ శుభవార్తను కమిన్స్ స్వయంగా సోషల్ మీడియా ద్వారా పంచుకుంటూ.. "మళ్ళీ బరిలోకి దిగేందుకు సిద్ధంగా ఉన్నాను" అని ప్రకటించాడు. వచ్చే శుక్రవారం అతను ఆస్ట్రేలియా నుంచి భారత్‌కు బయలుదేరి, తన ఆరెంజ్ ఆర్మీతో కలవనున్నాడు. ప్యాట్ కమిన్స్ తన రీఎంట్రీ కోసం ఏప్రిల్ 25న జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో జరిగే మ్యాచ్‌ను ముహూర్తంగా ఫిక్స్ చేసుకున్నాడు. గతేడాది జరిగిన యాషెస్ సిరీస్ తర్వాత ప్యాట్ కమిన్స్ మళ్లీ పోటీ క్రికెట్ ఆడలేదు. ఆ గాయం కారణంగానే కమిన్స్ ఇటీవలే ముగిసిన టీ20 ప్రపంచకప్ 2026కు కూడా దూరమయ్యాడు. కమిన్స్ లేని ఆస్ట్రేలియా జట్టు ఆ టోర్నీలో గ్రూప్ దశలోనే వెనుదిరగడం గమనార్హం. ఇప్పుడు పూర్తి ఫిట్‌నెస్‌తో ఐపీఎల్‌లోకి వస్తున్న కమిన్స్.. రాజస్థాన్ వంటి బలమైన జట్టుపై తన సత్తా చాటాలని పట్టుదలతో ఉన్నాడు.

## రోహిత్ ఫ్యాన్స్‌కు బ్యాడ్ న్యూస్

తొడకండరాల గాయంతో బాధపడుతున్న రోహిత్ శర్మ ఇంకొన్ని మ్యాచ్‌లకు దూరంగా ఉంటాడని ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా తెలిపాడు. మిచెల్ సాంట్నర్ అనారోగ్యంతో బాధపడుతున్నాడని దాంతో తుది జట్టులో మార్పులు అనివార్యమయ్యాయని చెప్పాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా పంజాబ్ కింగ్స్‌తో వాంఖడే మైదానం వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగింది. టాస్ సందర్భంగా మాట్లాడిన హార్దిక్ పాండ్యా.. యువ ప్లేయర్ మయాంక్ రావత్ అరంగేట్రం చేస్తున్నాడని తెలిపాడు. 'టాస్ గెలిస్తే మేం కూడా బౌలింగ్ చేయాలనుకున్నాం. కానీ పర్వాలేదు. కొన్నిసార్లు టాస్ ఓడిపోవడం కూడా మంచిదే. ఈ మ్యాచ్‌లోనైనా మేం మెరుగైన ప్రదర్శన చేయాలి. ఇప్పటి వరకు మేం మెరుగైన ప్రదర్శనే చేశాం. కానీ కొన్ని తప్పిదాలతో మూల్యం చెల్లించుకున్నాం. కీలక సమయాల్లో పట్టు కోల్పోతున్నాం. ఈ మ్యాచ్‌లో ఆ తప్పిదాలు చేయకుండా చూసుకుంటాం. గత మ్యాచ్‌లో నాలుగు ఓవర్లలో 20 కంటే ఎక్కువ పరుగులు ఇచ్చాం. టీ20 క్రికెట్‌లో ఇది ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. ఒక జట్టుగా మాకు ఆ విషయం తెలుసు. అటువంటి భారీ ఓవర్లు పడకుండా ఎలా నియంత్రించాలో మాకు తెలుసు. మేం దాని గురించి చర్చించి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాం. ఈరోజు అది ఎలా జరుగుతుందో చూద్దాం. గత మ్యాచ్ నుంచి రోహిత్ దూరంగా ఉన్నాడు. అతను కోలుకోవడానికి ఇంకా కొన్ని మ్యాచ్‌లు పట్టవచ్చు. మిచెల్ శాంట్నర్ కూడా అనారోగ్యంతో ఉన్నాడు. కాబట్టి జట్టులో కొన్ని మార్పులు ఉన్నాయి. క్వింటన్ డి కాక్ తిరిగి వచ్చాడు. మయాంక్ రావత్ ఈరోజు అరంగేట్రం చేస్తున్నాడు.'అని హార్దిక్ పాండ్యా తెలిపాడు.



ఈవార్తలు
ప్రజావాణి
శుక్రవారం 17-4-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు

# సంపాదకీయం Editorial

# ఆగని రాజకీయ విషం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పండెన్నేళ్లు గడుస్తున్నా, ఇంకా ఆ ప్రక్రియపై కొందరు నేతలు విషం కక్కుతుండటం దురదృష్టకరం. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనేది కోట్ల మంది ప్రజల దశాబ్దాల ఆకాంక్ష, బలిదానాల ఫలితం. దీనిని అవమానించడం అంటే తెలంగాణ సమాజాన్ని అవమానించడమే. ముఖ్యంగా బీజేపీకి చెందిన అగ్రనేతలు పార్లమెంటు వేదికగానో, బయటనో తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను తప్పుబడుతూ చేస్తున్న వ్యాఖ్యలు అసంబద్ధంగా, అప్రజాస్వామికంగా ఉన్నాయి. రాష్ట్ర విభజన జరిగిన తీరును విమర్శించే క్రమంలో తల్లిని చంపి బిడ్డను వేరు చేశారు వంటి అవాంఛనీయ వ్యాఖ్యానాలు చేయడం తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీస్తున్నాయి. రాజ్యాంగబద్ధంగా, ఉభయ సభల ఆమోదంతో జరిగిన ప్రక్రియను పదేపదే తప్పుబట్టడం ద్వారా ఆ పార్టీ ఏం సాధించాలనుకుంటోంది? ఒకవైపు తెలంగాణలో అధికారం కోసం ఆరాటపడుతూనే, మరోవైపు తెలంగాణ ఏర్పాటునే ప్రశ్నించడం వారి రెండు నాలికల ధోరణికి నిదర్శనం. తెలంగాణ ఏర్పాటు వల్ల కలిగిన ప్రయోజనాలను, సాధించిన అభివృద్ధిని గుర్తించకపోగా, ఇంకా విభజన గాయాలను కెలికే ప్రయత్నం చేయడం రాజకీయ దివాలాకోరుతనమే అవుతుంది. రాజకీయ ప్రయోజనాల కోసం ఒక ప్రాంత ఉనికిని, పోరాట చరిత్రను తక్కువ చేసి మాట్లాడటం మానుకోవాలి. ఇప్పటికైనా విమర్శలు మానుకుని, తెలంగాణ అభివృద్ధికి సహకరించడంపై దృష్టి సారించాలి. లేనిపక్షంలో, అస్తిత్వాన్ని కించపరిచే ఎవరికైనా తెలంగాణ సమాజం తగిన రీతిలో బుద్ధి చెప్పడం ఖాయం.

## రేపటి ఊపిరి

రేపటి వసంతాన్ని కలగనడం ఉగాది
నేటి జీవితాన్ని ఆవిష్కరించుకోవడం ఉగాది

నిత్యం గాయాలను మోస్తున్న జీవితాన్ని
ప్రతిసారి ఉగాదికి ఎదురుచూస్తూనే ఉంటాను
గాయాలను మాన్పే లేపనం కోసం
కలగంటూనే ఉంటాను

మానలేని గాయాలు ఒంటిలో ఎన్ని ఉన్నా
కాలచక్రగమనంలో గతించే శిథిలస్వప్నాలు
కన్నీటిలో ఆవిరయ్యే క్షణభంగురాలు

జీవంలేని మరయంత్రంగా
పనిచేస్తున్న జీవితాన్ని
నిత్యం ఉషోదయానికై
ఎదురుచూస్తూనే ఉంటాను
యాంత్రికత మాయమయ్యే మనిషితనం
కోసం మరిమరి పరితపిస్తుంటాను

పరుగుపందెంలాంటి జీవితంలో
ఒడిదుడుకులెన్నున్నా
దుఃఖసాగరంలా కల్లోల
కన్నీటి అలజడులు
అలుపెరుగని పోరాటంలో
ఆవిరయ్యే స్వప్నాలు

ఒకింత వేకువ కోసం
ఎదురుచూస్తున్నప్పుడల్లా
ప్రతి సంవత్సరం ఉగాది
ఊపిరిపోస్తూనే ఉంటుంది


జీవితనావలో కొట్టుకుపోతున్నప్పుడల్లా
నన్ను నేను వెతుకుంటున్నప్పుడల్లా
ఆశగా ఆహ్వానించి ఊపిరిపోస్తూనే
ఉంటుంది ఉగాది
సరికొత్త జీవితానికి బాటలు వేస్తూ
దారిచూపే చుక్కాని అవుతుంది ఉగాది

జీవితం... ఒక పరుగుపందెం
ఒంటరిగా ప్రయాణించి
సమూహంగా కలిసి నడవడం
జీవితం ... ఒక యుద్ధం
వ్యక్తిగా సాహసించి
సమిష్టిగా పోరుసల్పడం


జీవితమంటే...
సుఖదుఃఖాల సంగమం
తీపిచేదుల సమ్మిళితం
జీవితమంటే ఓడిపోవడం కాదు
ఓడిపోయిన ప్రతిసారి
నిటారుగా నిలబడడం
జీవితమంటే పరాభవం కాదు
పరాజయం పొందిన ప్రతిసారి
పరాక్రమంగా నిలబడడం

నిరాశగా నిస్తేజంగా ఉన్నప్పుడల్లా
ఆశను ధ్యానిస్తూ శ్వాస పీల్చుకోవడం
నిస్సత్తువ మనసును ఆవరించినప్పుడల్లా
సరికొత్త ఆలోచనలకు నాందీ పలకడం

పరాభవ ఉగాది
మన ఆశలకు, ఆశయాలకు
విజయనామ సంవత్సరం
మన సంకల్పాలకుసజీవ తార్కాణం



- డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్
9032844017



ప్రకృతిని చూసి పొంగిపోయే ఉషోదయపు కిరణాలు ఆమె కవిత్వం. శ్రీమతి నామని సుజనాదేవి గారి కవిత్వం ఓ ఊడలు దిగిన పెద్ద మర్రి చెట్టు దాని కింద మనం మత్తుగా నిద్రపోతూ తూనీగల రెక్కల శబ్దం వింటాం, మెల్లగా ఆకులను ఊపుతున్న గాలి మనతో మాట్లాడుతుంది. సమాజంలో దగాపడ్డ దుఃఖపు స్త్రీలు రోదిస్తూ మట్టి మాంసపు కండరాలను ఈ మృగాళ్లు నీలి గోళ్ళతో చీల్చడం మనం చూస్తాం. అందరి చేతుల్లోనూ శ్రమ ఉంటుంది. కదిలే మేఘం లా వంగుతూ నడిచే సౌందర్యం మాత్రం స్త్రీకే ఉంటుంది.

**ఈ కవితా సృజన శీలి బుతువుల్ని పిల్లల్లా ఆడుకుంటుంది. మన కళ్ళు గోడమీద గడియారాన్ని చూసి సమయాన్ని కొలుస్తాయి. జీవితాన్ని కొలవడా నికి మాత్రం ఏ దారిలోనూ ప్రమాద హెచ్చరికలు లేవని ఆవేదన చెందుతుంది. ఈ కవితా సంపుటిలో కవితలన్నీ ధాన్యపు గింజల గుట్టలే... దానిమీద కొన్ని పిట్టలు వాలి దిగులు ముఖం లేని ఆకాశాన్ని చూస్తూ ఏరుకు తింటాయి.**

## మిస్సెస్ ఫలానా..
## కన్నీటి పొరల శిశిరం



- పొత్తూరి సీతారామరాజు
కవి, రచయిత
కాకినాడ, 9948849607

ఈమె కవిత్వం చదివాక జీవితాన్ని బతికి ఉండటం చూసాను నేను. ఎక్కడ చూసినా కత్తుల నెత్తుటి పూతలే వర్తమానం గుండె కోతతో నేలంతా ఎర్రని గాయాలే... గాయపడటానికేనా మన మానవ సంబంధాలు. గాయపడకుండా ప్రేమించలేమా? భయాన్ని గుండెల్లో ఒంపుకుని పిగిలి పగిలి రగిలిపోతూ నవ నాగరిక నేలమీద ఇలాగే నడుచుకుంటూ పోదామా? గతం శిథిల సకలాల సమూహమే కావచ్చు వర్తమానాన్ని శో కపు ముద్దగా చేసి ప్రకృతిని, స్త్రీని కన్నీటి పొరల శిశిరం గా మార్చొద్దు అని సమాజానికి హెచ్చరిస్తుంది. మోడు వారిన కొమ్మలపై గూడు కట్టుకుంటున్న కొన్ని గాయపడ్డ పక్షులను పొదివి పట్టుకుని ఒడిలో దాచుకోమంటుంది. అమ్మ పొగ చూరిన వంట గదిలో చేతి ముని వేళ్ళ స్పర్శ ఇంకా గోడల మీద పచ్చిగానే ఉంది, ఆమె వెళ్లిపోయినా అంటుంది. కలలకు అందకుండా ఆలోచనలు రాలిపోతుంటాయి. కంటి చూపు మాత్రం ప్రయాణాన్ని ఆపదు. నువ్వు జీవితంలో ఎన్ని తప్పులు చేసినా జీవితమనే రైలులో అందరూ దిగేశాక బోగీ లో ఒంటరి ప్రయాణికుడివే, కష్టం అనే పిశాచాన్ని నువ్వు కౌగిలించుకోవడమే కాదు తరువాత తినేస్తున్నావ్. మనిషితోపాటు మమతతో పాటు మానవత్వంతో పాటు, మంచి మనుషులను కూడా వదిలిపెట్టని భూతాలు ఇప్పుడు మన మధ్యనే తిరుగుతున్నాయి. కన్నీళ్లు తాగి కడుపు నింపుకొని ఎన్ని కళేబరాలను కౌగిలించుకుంటావు. ఉనికి కోల్పోయాక ఉప్పుచారలు నీ ముఖం మీద ఉరితాడును వేలాడతీస్తాయి. దారిలో న ముల్లుంటే బాధపడకండి. రుధిరాలు చిందించిన ఈ నేల మీద మళ్లీ సరికొత్త పూల సేద్యం పుడుతుంది. ఒంటరినని భ్రమ పడుతూ నిరాశతో నలిగిపోకండి. సుధలు పంచే హృదయం ఉన్నవారు ఇంకా చెదిరిపోలేదు. ఉదయాలను మరిపించే హృదయం మనకు ఉండాలి. కళ్ళపై ఒరిగిపోయే చెట్లు కోకొల్లలు. వేదనలు కరిగించే వెలుగు ముందు కన్నీటిని దాసోహం కానివ్వకు. కలలోనే బతికేస్తూ కాలాన్ని నిందించకు, శ్రమదారుల కురిపిస్తే ఇదిగో చూడు గెలుపన్నది నాలాగే వెలుగుతో సింహాసనం మీద కూర్చుంటుంది చూడు. అన్న వాస్తవిక దృక్పథాన్ని జోడిస్తూ ఈ కవిత్వాన్ని ముందుకు నడిపించే గొప్ప సాహితీ మూర్తి శ్రీమతి నామని సుజనా దేవి గారు. ఆమె జీవితంలో ఉన్నతంగా వ్యక్తిగా సాహితీ మూర్తిగా ఎదిగిన తర్వాత తనను తాను నిరూపించుకున్న తర్వాత రాసే గొప్ప కవిత్వం. మాటలపర్వంలో మంచితనం గుబాళిస్తుంది. ఆరోగ్యకరమైన నవ్వులు చిందిస్తుంది. ఒక సమూహ సౌందర్యమై మనుషులందరి మధ్య విరబూస్తుంది. మొక్కలై కదలాడుతున్న మానవ కోటి మధ్య మహా వృక్షమై వెలుగు ఇస్తుంది. ఆమె వాక్యం లోతట్టు గుండెల్ని తట్టి లేపుతున్న ఉరుముల ధ్వని. ఆమె కవిత్వం చూరుల కింద సిమెంట్ రేకుల కింద పూరి కప్పులు కింద రహదారికి ఇరువైపులా గుంపులు గుంపులై బ్రతికే జనం చుట్టూ తిరుగుతుంది. యుద్ధం కొత్త ఏమీకాదు గడిచిన యుగాల్లోనూ జరిగింది. కానీ ఇప్పుడు ఆయుధాలు లేని యుద్ధం జరుగుతుంది. యుద్ధం ముగిసాక మాత్రం శవాల సమూహం పై నడిచేది మృత్యువు అని తన ఈ కవిత ద్వారా తెలియజేస్తారు ఈమె. నా పేరు ఆడది. అంటే అన్నిటిని భరించేది అని అర్థం. ఇన్నిటిని అడిగిన నీవు నీ మనస్సాక్షిని అడిగితే అది ఎంచెబుతుందో తెలుసా స్త్రీ అంటే శక్తి అని. కనే శక్తి మోసే శక్తి భరించే శక్తి. ఆ శక్తిని నింపుకున్న మీ కలానికి ఆ విషయం బాగా తెలుసు. ఆమె కాలాన్ని ఒడిలో నిద్రపుచ్చి తల నిమీరినప్పుడు సముద్ర ఘోష నిశ్శబ్దమవుటము విన్నాను ... ఎంత లోతుగా రాసారు. జీవితాన్ని మర్చిపోతే కాలం నోట్లోకి క్రమక్రమంగా జారిపోతుంటాం. జీవితాన్ని క్రమక్రమంగా ఐశ్వర్యం తినేస్తుంటుంది .అందలాలు ఎక్కించి వందనాలు చేయిస్తుంది. కాలం ఓ పిచ్చి కుక్క అది ఎప్పుడు కరుస్తుందో మనకే తెలియదు. అది కరిచిన తర్వాత మనమే ఉండం. నువ్వు నవ్వును అలంకరించుకున్న జ్ఞాపకం. రచయిత్రి 'నేనెవర్ని' అని తనను తాను ప్రశ్నించుకుంటుంది. మొదట పసిపాపకు చనుబాలు ఇచ్చే అమ్మను. వేకువ కంటే ముందే లేచి ఎంత హోదాలో ఉన్నా ఇంటి పనులను పూర్తి చేసి ఆఫీసుకు వెళ్లే సగటు ఆడదాన్ని. స్వప్నశీలో మాత్రమే రెక్కలతో విహరిస్తాను. ఇంతకీ నా పేరు ఏంటో నాకే తెలీదు. వంటిల్లు నడిగితే వంటలక్కనంది. ఇల్లు వాకిటని అడిగితే పనిమనిషి అంది. ఆరేసిన బట్టల నడిగితే చాకలిఅంది. తమ్ముడు అక్క అన్నాడు. భర్త నాకు బాకీ ఉన్న భార్య అన్నాడు. కొడుకు అమ్మన్నాడు. ఇంతకీ నా పేరేంటి. బ్రతుకు చివరి అంకం దాకా వీళ్ళ కోసం పనిచేసి చేసి వేకువ కంటే ముందు ఆత్మార్పణానికి సమాయత్తమయ్యే వేగుచుక్కనని వీళ్ళకి తెలియదు పాపం, భూమికంటే ముందు పుట్టిన అమ్మను చేతులెత్తి మొక్కాలి కదా ఈ పదాలు రాసిన ఈ అమ్మకు, ఈమె వెళ్లే దారిలో పల్లేరు కాయలు కాసినవి కావు. పరిచినవి. జీవితమంతా సుఖం అనుభవించని పట్టు పరుపు పానుపు ఈ విశ్వానికి అమ్మ. అమ్మ ఓ అనంత కావ్యం, ఓ సృష్టికర్త. అన్నియుగాల్లోనూ ఆమెకు పాదాభివందనములే. ఇంతటి మంచి కవిత్వాన్ని రాసి వెలువరిస్తున్న శ్రీమతి నామని సుజనా దేవిగారికి నా నమస్సులు.

**- ఈ కవితా సంపుటి కావాల్సిన వారు రచయిత్రి చరవాణి నెంబర్ 7799305575 ద్వారా సంప్రదించవచ్చు.**




## ఐదేళ్లు చాలేమో..!

తెలంగాణ రాజకీయ ముఖచిత్రం వేగంగా మారుతోంది. మొన్నటి వరకు అధికార పక్షం నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు వెల్లువలా సాగగా, ఇప్పుడు పరిస్థితి రివర్స్ అవుతోంది. పార్టీ కీలక నేతలు, సిట్టింగ్ ప్రజాప్రతినిధులు హస్తం పార్టీని వీడి ఇతర గూటికి చేరుతుండటం రాష్ట్ర కాంగ్రెస్‌కు పెద్ద దెబ్బగానే పరిగణించాలి. అధికారం చేతిలో ఉన్నప్పటికీ, అంతర్గత విభేదాలు మరియు సమన్వయ లోపం కారణంగా నేతలను కాపాడుకోవడంలో పార్టీ విఫలమవుతోంది. వలసలకు ప్రధాన కారణం పార్టీలోని "గ్రూపు రాజకీయాలు" అని స్పష్టమవుతోంది. సీనియర్లకు, కొత్తగా చేరిన వారికి మధ్య పొత్తు కుదరకపోవడం, పదవుల పంపకంలో అసంతృప్తి నేతలను బయటకు పంపుతున్నాయి. ముఖ్యంగా కీలక జిల్లాల్లో బలమైన పట్టున్న నాయకులు వెళ్ళిపోవడం వల్ల క్షేత్రస్థాయిలో కేడర్ అయోమయంలో పడిపోతోంది. ఇది రాబోయే ఎన్నికల మీద లేదా స్థానిక సంస్థల ఎన్నికల మీద తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రభుత్వాన్ని నడపడం ఒక ఎత్తయితే, పార్టీని పటిష్టంగా ఉంచుకోవడం మరో ఎత్తు. కాంగ్రెస్ అధిష్టానం, రాష్ట్ర నాయకత్వం ఈ వలసలను కేవలం "వ్యక్తిగత స్వార్థం" అని కొట్టిపారేయకుండా, ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. నేతలలో ఉన్న అసంతృప్తిని ముందే గుర్తించి బుజ్జగించడంలో వైఫల్యం చెందితే, అధికారంలో ఉండి కూడా బలహీనపడే ప్రమాదం ఉంది. పార్టీకి పునాదులైన కార్యకర్తలు కష్టపడి అధికారంలోకి తెచ్చిన తర్వాత, నాయకులు ఇలా వలస బాట పట్టడం పార్టీ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తుంది. ఈ పరిణామాలు ప్రతిపక్షాలకు అస్త్రాలుగా మారుతున్నాయి. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకత్వం మేల్కొని, వలసలకు అడ్డుకట్ట వేయకపోతే రాష్ట్రంలో పార్టీ ఉనికికే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

**- కొత్తపల్లి మహేశ్వర్ రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా**

## ఆకులు రాలిన వసంతం

*ఆకులు రాలిన వసంతం.. ఎందుకింత ఖాళీగా కనిపిస్తుందో తెలుసా?*
*పూలు పూయాల్సిన కాలం.. కన్నీళ్లు జారిన కాలమైపోయింది..*
*గాలిలో ఒక నిశ్శబ్దం ఉంది, మాట్లాడాలని తపించే ఒంటరితనం ఉంది..*
*చెట్టు నిలబడే ఉంది కానీ, ఆత్మ మాత్రం ఎక్కడో విరిగిపోయింది..*
*పచ్చగా నవ్వాల్సిన కొమ్మలు, ఎండిన జ్ఞాపకాల్ని పట్టుకుని నిలిచిపోయాయి..*
*వసంతం వచ్చిందని ప్రపంచం చెప్తుంటే,*
*నా హృదయం మాత్రం శరదృతువే అంటుంది..*
*ఎవరూ గమనించరు ఈ*
*మార్పుని, బయట రంగులు*
*మారకపోతే..*
*కానీ లోపల రాలిన ప్రతి ఆకు,*
*ఒక కథ చెబుతోంది..*
*వినిపించని కథ..*
*నిన్నటి ఆశలన్నీ*
*నేలకూలిపోయి, ఈరోజు*
*నిశ్శబ్దంగా నిద్రపోతున్నాయి..*
*రేపు మళ్లీ పువ్వులు పూస్తాయే-*
*ఎమో.. కానీ ఈ గాయం*
*గుర్తుగా మిగిలిపోతుంది..*
*ఆకులు రాలిన వసంతం.. ఇది*
*అంతం కాదు.. ఒక విరామం మాత్రమే..*
*ఎందుకంటే ప్రతి రాలిన ఆకులోనూ,*
*మరో కొత్త జీవితం మొలకెత్తే వాగ్దానం దాగుంది సుమీ!*



- రమాదేవి కులకర్ణి
రైటర్, మోటివేషనల్ స్పీకర్
హైదరాబాద్ - 8985613123

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.